


# పెన్ పవర్

తెలుగు దిన పత్రిక PEN POWER TELUGU DAILY ప్రశ్నించడం మన హక్కు




సంపుటి : 11 సంచిక : 318 పేజీలు : 8+8 ఎగ్జిక్యూటివ్ ఎడిటర్ : పి. గౌతమి బుధవారం 23 జూలై 2025

Published form Medchal Malkajgiri, Circulated by Hyderabad, Rangareddy, Medak, Sangareddy, Siddipet, Nalgonda

## రేవంత్ రెడ్డి ఫ్లైట్ మోడ్ సీఎం



- ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిపై ఎమ్మెల్సీ కవిత తీవ్ర విమర్శలు
- ఢిల్లీకి వెళ్లడంలో అర్థ సెంచరీ సాధించారన్న కవిత
- బీసీ రిజర్వేషన్లపై జాతీయ పార్టీలు మోసం చేస్తున్నాయని ఆగ్రహం

హైదరాబాద్ పెన్ పవర్:తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిపై బీఆర్ఎస్ ఎమ్మెల్సీ, జాగృతి అధ్యక్షురాలు కల్వకుంట్ల కవిత తీవ్ర విమర్శలు చేశారు. మన రాష్ట్ర ముఖ్యమంత్రి ఫ్లైట్ మోడ్ సీఎం అని ఎద్దేవా చేశారు. ఆయన ఈ రోజు కూడా ఢిల్లీకి వెళుతున్నారని, దేశ రాజధానికి వెళ్లడంలో ఆయన ఇప్పటికే అర్ధ సెంచరీ సాధించారని వ్యంగ్యం ప్రదర్శించారు. ఇన్నిసార్లు ఢిల్లీకి వెళ్లిన రేవంత్ రెడ్డి బీసీ రిజర్వేషన్లపై మాత్రం ప్రధానమంత్రి నరేంద్ర మోదీని ఒప్పించే ప్రయత్నం చేయలేదని మండిపడ్డారు. అఖిలపక్షాన్ని ఢిల్లీకి తీసుకువెళ్లి గట్టిగా మాట్లాడాలని సూచించారు. హైదరాబాద్‌లో ఆమె మీడియాతో మాట్లాడుతూ,

వివరాలు 2లో..



# బీసీ రిజర్వేషన్లపై బీజేపీ పీటముడి..

## 42% సాధ్యం కాదంటున్న కమలం పార్టీ..

- 9 షెడ్యూల్ లో చేర్చాల్సిందేనన్న కాంగ్రెస్
- సాధ్యం కాకుంటే రాష్ట్ర బీజేపీ ఎంపీలు రాజీనామా చేయాలన్న మంత్రి పొన్నం
- మేం హామీ ఇవ్వలేదంటున్న రాంచందర్ రావు
- ముస్లింలను జాబితాలో ఎలా చేర్చారంటున్న బండి
- 24న ఢిల్లీలో ఎంపీలతో సీఎం రేవంత్ సమావేశం

హైదరాబాద్ పెన్ పవర్: బీసీలకు 42% రిజర్వేషన్లు కల్పించేందుకు కాంగ్రెస్ పార్టీ ప్రయత్నాలకు బీజేపీ రూపంలో అడ్డంకి ఎదురవుతోంది. 42% రిజర్వేషన్లు సాధ్యం కాదని, రిజర్వేషన్ల పరిమితి 50% మించొద్దని గతంలోనే సుప్రీంకోర్టు చెప్పిందని బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు రాంచందర్ రావు నిన్న ఢిల్లీలోకుండబద్దలు కొట్టారు. బీసీ రిజర్వేషన్లకు సంబంధించి న్యాయపరమైన చిక్కులను పరిష్కరించినట్లు రాష్ట్ర ప్రభుత్వం అసెంబ్లీలో ప్రకటన చేసిందని అన్నారు. ఇప్పుడు 9వ షెడ్యూల్ లో చేర్చాలనడం ఏమిటన్నారు. 42 శాతం అంటే, 50 శాతం పరిమితి దాటుతుందని, బీసీ రిజర్వేషన్లు పెంచాలంటే రాష్ట్ర ప్రభుత్వం పంచాయతీరాజ్ చట్టంలోని సెక్షన్ 285ని సవరించాల్సి ఉంటుందని రాంచందర్‌రావు ప్రస్తావించారు.

ఇవేవీ పట్టించుకోకుండా షెడ్యూల్ 9లో చేర్చాలనడంపై ఆగ్రహం వ్యక్తం చేశారు. దీనిపై కాంగ్రెస్ పార్టీ కూడా అదే స్థాయిలో కౌంటర్ ఇచ్చింది. మంత్రి పొన్నం ప్రభాకర్ మాట్లాడుతూ.. 'రామచందర్‌రావు మరోసారి తన నిజస్వరూపం బయట పెట్టుకున్నారు. బీసీల రిజర్వేషన్లను 9వ షెడ్యూల్‌లో చేర్చడం అసాధ్యం అంటున్నారు. పొరుగు రాష్ట్రం తమిళనాడులో రిజర్వేషన్లు పెంచారు. రాష్ట్రం నుంచి ఎన్నికైన బీజేపీ ఎంపీలు రాజీనామా చేయాలి. ఎంపీలు రాజీనామా చేస్తే బీసీ రిజర్వేషన్లు ఎందుకు అమలుకావో చూస్తాం. బీసీ రిజర్వేషన్ల పెంపుపై కేంద్రం వెంటనే నిర్ణయం తీసుకోవాలి. బీసీ వర్గాలకు అన్యాయం జరిగితే చూస్తూ ఊరుకోబోం" అని హెచ్చరించారు. న్యాయపరమైన చిక్కులున్నాయని తెలిసినా కాంగ్రెస్ నాయకులు కామారెడ్డి డిక్లరేషన్ అని ప్రకటించారని, దానిని అమలు చేసే బాధ్యత వారిదేనని కేంద్ర మంత్రి బండి సంజయ్ కుమార్ గతంలోనే ప్రకటన చేశారు.

తొమ్మిదో షెడ్యూల్‌ను చూపిస్తూ కేంద్రంపై నిందలు వేయకుండా, 42 శాతం రిజర్వేషన్ల హామీని ఏ విధంగా ఇచ్చారో ఆ విధంగా అమలు చేయాలని డిమాండ్ చేశారు. బీసీల జాబితాలో ముస్లింలను ఎలా చేర్చుతారని ఆయన మండిపడ్డారు. ఇదే తరుణంలో కేంద్రంపై ఒత్తిడి పెంచేందుకు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఈ నెల 24న ఢిల్లీలో కాంగ్రెస్ ఎంపీలతో సమావేశం నిర్వహించనున్నారు.

ఈ సమావేశంలో కులగణన చేపట్టిన తీరును వివరించనున్నారు. అదే సమయంలో రిజర్వేషన్ల అమలు కోసం 9 వ షెడ్యూల్ లో చేర్చుతూ ఉభయ సభల్లో తీర్మానం చేసేలా చూడాలని ఏఐసీసీ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గేను, లోక్ సభలో ప్రతిపక్ష నేతగా ఉన్న రాహుల్ గాంధీ ని రిక్వెస్ట్ చేయనున్నారు.

### గవర్నర్ వద్దే ఆర్డినెన్స్

పంచాయతీరాజ్ యాక్ట్? - 2018 సవరణ ఆర్డినెన్స్ పై గవర్నర్ జిష్ణుదేవ్ వర్మ న్యాయ సలహా కోరారు. 2018 పంచాయతీరాజ్ చట్టంలోని సెక్షన్285 (ఏ)లో రిజర్వేషన్లు 50 శాతం మించవద్దనే నిబంధన ఉండగా, దానిని కులగణన సర్వేలోని ఎంపిరికల్? డేటా ఆధారంగా రిజర్వేషన్లు ఉంటాయని ఇటీవల ప్రభుత్వం మార్చింది.

వివరాలు 2లో..

## ధన్ ఖడ్ రాజీనామాకు రాష్ట్రపతి ఆమోదం



హైదరాబాద్ పెన్ పవర్:ఉపరాష్ట్రపతి జగదీప్ ధన్ ఖడ్ రాజీనామాకు రాష్ట్రపతి ద్రౌపది ముర్ము మంగళవారం ఆమోదం తెలిపారు. ఆయన రాజీనామా వెంటనే అమలులోకి వస్తుందని ప్రకటించారు. ఈ మేరకు ధన్ ఖడ్ రాజీనామాను ఆమోదిస్తున్నట్లు సంతకం చేసి లేఖను హెూంశాఖకు పంపించారు. కాగా, సోమవారం పార్లమెంట్ వర్షాకాల సమావేశాలు ప్రారంభం కాగా చైర్మన్ హెూదాలో జగదీప్ ధన్ ఖడ్ రాజ్యసభ కార్యక్రమాలను

వివరాలు 2లో..

## ధన్‌ఖడ్‌కు ఏం కాలే.. ఆయన హెల్తీగా ఉన్నరు

### రాజీనామాపై దీదీ సంచలన వ్యాఖ్యలు



హైదరాబాద్ పెన్ పవర్: భారత మాజీ ఉప రాష్ట్రపతి జగదీప్ ధన్ ఖడ్ రాజీనామా వ్యవహారం దేశ రాజకీయాల్లో చర్చనీయాంశంగా మారింది. అనారోగ్య కారణా లు చూపుతూ ఆల్ ఆఫ్‌సడెన్‌గా ఆయన పదవికి రాజీనామా చేయడం.. 24 గంటలు కూడా గడవకముందే ధన్‌ఖడ్ రాజీనామాకు రాష్ట్రపతి ఆమోదం తెలపడం అనేక సందేహాలకు తావిస్తోంది. ధన్‌ఖడ్ ఆకస్మిక రాజీనామాకు అనారోగ్యం కారణం కాదని.. అసలు రీజన్ వేరే ఉందని ప్రతిపక్షాలు ఆరోపిస్తున్నాయి.

వివరాలు 2లో..

## బెట్టింగ్ యాప్ కేసు.. ఈడీని సమయం కోరిన రానా దగ్గుబాటి, మంచు లక్ష్మి

- నలుగురికి నోటీసులు జారీ చేసిన ఈడీ
- షూటింగ్ బిజీ కారణంగా సమయం కోరిన రానా దగ్గుబాటి
- తనకు కేటాయించిన తేదీన హాజరు కాలేనని సమాచారం ఇచ్చిన మంచు లక్ష్మి



హైదరాబాద్ పెన్ పవర్:బెట్టింగ్ యాప్‌ల కేసు విచారణకు హాజరయ్యేం దుకు సినీ నటులు రానా దగ్గుబాటి, మంచు లక్ష్మి ఈడీని గడువు కోరారు. బెట్టింగ్ యాప్‌ల కేసులో విచారణకు హాజరు కావాలని వీరితో పాటు ప్రకాశ్ రాజ్, విజయ్ దేవరకొండలకు కూడా ఈడీ నోటీసులు జారీ చేసింది. రానా దగ్గుబాటి విచారణకు హాజరు కావాల్సి ఉండగా, షూటింగ్ నిమిత్తం సమయం కావాలని ఆయన కోరారు.

వివరాలు 2లో..

## మాకు ఏది అవసరమో అదే చేస్తాం ఈయూ ఆంక్షలపై భారత్ స్పందన




- రష్యా నుంచి క్రూడ్ దిగుమతి చేసుకుంటున్న భారత్
- ఇటీవలే అమెరికా హెచ్చరిక
- ఇప్పుడు అదే బాటలో యూరోపియన్ యూనియన్
- జాతీయ ప్రయోజనాలే ముఖ్యమన్న భారత్

హైదరాబాద్ పెన్ పవర్:యూరోపియన్ యూనియన్ (ఈయూ) ఆంక్షలు మరియు పాశ్చాత్య దేశాల ఒత్తిడి ఉన్నప్పటికీ, రష్యా నుంచి చమురు దిగుమతులపై భారతదేశం తన వైఖరిని స్పష్టం చేసింది. భారతదేశం తన ఇంధన భద్రతకు అత్యధిక ప్రాధాన్యత ఇస్తుందని విదేశాంగ కార్యదర్శి విక్రమ్ మిస్రీ నొక్కిచెప్పారు. ప్రజలకు ఇంధన

వివరాలు 2లో..

## త్వరలోనే ట్యాంక్ బండ్‌పై దాశరధి విగ్రహం ఏర్పాటు చేస్తం



హైదరాబాద్ పెన్ పవర్: త్వరలోనే ట్యాంక్ బండ్?పై దాశరథి కృష్ణమాచర్య విగ్రహాన్ని ఏర్పాటు చేసి ఆవిష్కరిస్తామని రాష్ట్ర పర్యాటక శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావు తెలిపారు. మంగళవారం (జూలై 22) తెలంగాణ ప్రభుత్వం, భాషా సాంస్కృతిక శాఖ ఆధ్వర్యంలో రవీంద్రభారతిలో దాశరథి సాహితీ పురస్కార ప్రదానోత్సవ కార్యక్రమం జరిగింది.దాశరథి–2025 అవార్డు విజేత, ప్రముఖ కవిత అన్నవరం దేవేందర్‌కు పురస్కారం అందించారు. ఈ సందర్భంగా మంత్రి జూపల్లి మాట్లాడుతూ.. దాశరథి కృష్ణమాచర్య – 2025 అవార్డ్ అందుకున్న అన్నవరం దేవేందర్‌కి శుభాకాంక్షలు తెలిపారు. సమాజాన్ని చైతన్య పరిచేవారే

వివరాలు 2లో..

## గోల్డెన్ డోమ్ ప్రాజెక్ట్.. స్పేస్‌ఎక్స్‌కు ప్రత్యామ్నాయాల వేటలో ట్రంప్



పెన్ పవర్ డెస్క్:గోల్డెన్ డోమ్ క్షిపణి రక్షణ వ్యవస్థను నిర్మించడానికి భాగస్వాముల కోసం ట్రంప్ పరిపాలన అన్వేషణను విస్తరిస్తోంది. Amazon.com ప్రాజెక్ట్ కైపర్, పెద్ద పెద్ద డిఫెన్స్ కాంట్రాక్టర్లను ఆశ్రయిస్తోంది. ఎలోన్ మస్క్‌తో విభేదాల క్రమంలో

వివరాలు 2లో..

## స్థానిక ఎన్నికలు... రేవంత్ రెడ్డిని కలిసిన యువజన కాంగ్రెస్ అధ్యక్షుడు

- ఎన్నికల్లో యువజన నాయకులకు 20 శాతం సీట్లు కేటాయించాలని విజ్ఞప్తి
- ఈ మేరకు ముఖ్యమంత్రికి వినతి పత్రం ఇచ్చిన జక్కిడి శివచరణ్ రెడ్డి
- ముఖ్యమంత్రి హామీ ఇచ్చారని వెల్లడి



హైదరాబాద్ పెన్ పవర్:తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిని రాష్ట్ర యువజన కాంగ్రెస్ అధ్యక్షుడు జక్కిడి శివచరణ్ రెడ్డి, యువజన కాంగ్రెస్ నాయకులు కలిశారు. త్వరలో జరగనున్న స్థానిక సంస్థల ఎన్నికల్లో యువజన నాయకులకు 20 శాతం సీట్లు కేటాయించాలని ముఖ్యమంత్రిని కోరారు. ఈ మేరకు ముఖ్యమంత్రికి వినతిపత్రం అందజేశారు.

వివరాలు 2లో..

## హెచ్‌సీఏ విషయంలో దుష్ప్రచారం చేయవద్దు

- ఓటింగ్ విషయంలో ఐఏఎస్, ఐపీఎస్‌లపై ప్రచారం
- ఖండించిన అడిషనల్ డైరెక్టర్ జనరల్ ఆఫ్ పోలీసు
- కేసు సంబంధిత అప్‌డేట్‌లను సీఐడీ అధికారికంగా విడుదల చేస్తుందని వెల్లడి




హైదరాబాద్ పెన్ పవర్:హైదరాబాద్ క్రికెట్ అసోసి యేషన్ (హెచ్‌సీఏ) కేసు విషయంలో దుష్ప్రచారం చేయవద్దని తెలంగాణ సీఐడీ అడిషనల్ డీజీపీ చారుసిన్హా మీడియాకు విజ్ఞప్తి చేశారు. ఓటింగ్ విషయంలో ఐఏఎస్, ఐపీఎస్‌లపై అసత్య ప్రచారం చేయవద్దని ఆమె కోరారు. కేసు సంబంధిత

వివరాలు 2లో..

## జాతీయ స్థాయిలో కులగణన తెరపైకి రావడంలో తెలంగాణదే కీ రోల్




హైదరాబాద్ పెన్ పవర్: రాష్ట్రంలో నిర్వహించిన కులగణన ఆధారంగానే బీసీలకు 42 శాతం రిజర్వేషన్లు ఇవ్వాలని నిర్ణయించామని డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క తెలిపారు. గవర్నర్ ఆర్డినెన్స్ జారీ చేయగానే బీసీలకు 42 శాతం రిజర్వేషన్లపై ముందకెళ్తామని స్పష్టం చేశారు. మంగళవారం (జూలై 22) సెక్రటేరియట్లో భట్టి మీడియాతో మాట్లాడుతూ.. బీసీలకు 42 శాతం రిజర్వేషన్లు కల్పించే బిల్లు రాష్ట్రపతి వద్ద పెండింగ్?లో ఉందని.. ఈ బిల్లుకు పార్లమెంట్లో అన్ని పార్టీల మద్దతు కూడగట్టే ప్రయత్నం చేస్తామని చెప్పారు.

వివరాలు 2లో..

## ఎడిటర్ వ్యూ

# ఏదో జరుగుతున్నట్లుందే

వైసీపీ అధినేత జగన్ విషయంలో కేంద్రంలో అధికారంలో ఉన్న బీజేపీ కొంత సానుకూలతతోనే ఉన్నట్లు తెలుగుదేశం పార్టీ నేతలు అనుమానిస్తున్నారు. వైఎస్ గన్ ఢిల్లీకి వెళ్లకపోయినా ఆయన ఇక్కడి నుంచి పార్టీ అగ్రనేతలతో టచ్ లో ఉన్నారన్న అనుమానాన్ని వ్యక్తం చేస్తున్నారు. బీజేపీ కూడా సాఫ్ట్ కార్నర్ గానే వ్యవహరిస్తున్నారని, అదే సమయంలో బీజేపీ పై జగన్ పార్టీ పెద్దగా విమర్శలు చేయకపోవడాన్ని కూడా గుర్తు చేస్తున్నారు. గతంలో తాము వ్యతిరేకించినప్పుడు ఏపీలో పర్యటించినప్పుడల్లా చంద్రబాబుపైనా, తెలుగుదేశం పాలనపైన విమర్శలు చేసే ప్రధాని నరేంద్ర మోదీ సయితం ఈసారి జగన్ విషయాన్ని ప్రస్తావించకపోవడాన్ని కొందరు గుర్తు చేస్తున్నారు. రాష్ట్రంలో, కేంద్రంలో మిత్రపక్షంగా ఉన్న తమను కాదని, జగన్ ను కూడా చంకన పెట్టే ప్రయత్నం చేస్తున్నారన్న అనుమానం వారిలో బలపడుతుంది.

**మోదీ ప్రసంగాల్లోనూ...**

ఇటీవల వరసగా రెండు సార్లు ప్రధాని నరేంద్ర మోదీ ఏపీ పర్యటనకు వచ్చారు. అమరావతి రాజధాని రీలాంచింగ్ పనులకు శంకుస్థాపన చేయడానికి వచ్చినప్పుడు జగన్ ప్రస్తావన లేకుండా తన ప్రసంగంలో జాగ్రత్త పడ్డారనిపిస్తుంది. అదే సమయంలో చంద్రబాబు నాయుడును, పవన్ కల్యాణ్, లోకేశ్ లను పొడిగినప్పటికీ జగన్ ను విమర్శించకపోవడాన్ని వారు ఈ సందర్భంగా గుర్తు చేస్తున్నారు. అలాగే విశాఖకు కూడా కూటమి ప్రభుత్వం ఏర్పాటయిన తర్వాత రెండుసార్లు ప్రధాని మోదీ వచ్చినప్పటికీ బహిరంగ సభలో జగన్ ప్రస్తావన తేవకపోవడాన్ని తప్పుపడుతున్నారు. గత ప్రభుత్వం వైఫల్యం కారణంగానే అని పాసింగ్ రిమార్క్ చేశారు తప్పించి జగన్ అవినీతిపై పెద్దగా మాట్లాడలేదని తెలుగుతమ్ముళ్లు కొంత అసంతృప్తిగా ఉన్నారని తెలిసింది.

**ఏదో జరుగుతుందని...**

ఇక జగన్ కేసుల్లో కూడా ఎలాంటి పురోగతి లేకపోవడాన్ని కూడా వారు ఏదో జరుగుతుందన్న అనుమానాన్ని వ్యక్తం చేస్తున్నారు. జగన్ పై 2014లో నమోదయిన అనేక కేసుల్లో దర్యాప్తు వేగవంతంగా జరగడం లేదు. న్యాయస్థానాల్లో అనేక కేసులు ఇంకా పెండింగ్ లోనే ఉన్నాయి. వాటిపై అతీ గతీ లేదని అంటున్నారు. ఇక వైఎస్ వివేకానందరెడ్డి హత్య కేసులోనూ ఎలాంటి పురోగతి లేదు. వైఎస్ వివేకానందరెడ్డి హత్య జరిగి దాదాపు ఆరేళ్లు గడుస్తున్నా సీబీఐ కేసును సరిగా దర్యాప్తు చేయకపోయినా కేంద్ర ప్రభుత్వం పట్టించుకోవడం లేదన్న అసంతృప్తి తెలుగుదేశం పార్టీ నేతల్లో ఉంది. ఈ కేసుల్లో అనుమానితులైన వారు బెయిల్ పై ఉండటాన్ని కూడా ప్రస్తావిస్తున్నారు.

**చిన్న విషయానికి కూడా...**

ఇక చిన్న విషయమూ బయటకు వచ్చినా వెంటనే స్పందించే ఎన్ ఫోర్స్ మెంట్ డైరెక్టరేట్ అధికారులు మద్యం కుంభకోణం కేసులో ముందడుగు వేయడం లేదన్న ఉక్రోశాన్ని వెళ్లగక్కుతున్నారు. తాజాగా సోమిరెడ్డి చంద్రమోహన్ రెడ్డి కూడా మద్యం కుంభకోణం కేసును ఈడీ సీరియస్ గా తీసుకోకపోవడాన్ని తప్పుపట్టారు. చిన్నా చితకా కేసుల్లో హడావిడి చేసే ఈడీ అధికారులు దాదాపు 3,200 కోట్ల రూపాయల కుంభకోణంపై ఎందుకు స్పందిచండం లేదని ప్రశ్నించారు. కేవలం నిందితులను విచారించి వదిలేశారన్న విమర్శలు టీడీపీ నుంచి బహిరంగంగా వినిపిస్తున్నాయి. దీంతో ఢిల్లీ స్థాయి కమలం నేతలపై అనుమాన బీజం సైకిల్ పార్టీ నేతల్లో బయలుదేరిందనుకోవాలి. ఆ అనుమానం పెరిగి పెద్దది కాకముందే బీజేపీ తగిన చర్యలకు ఉపక్రమించాలని నేతలు కోరుతున్నారు.

### మాకు ఏది అవసరమో అదే చేస్తాం

# ఈయూ ఆంక్షలపై భారత్ స్పందన

- మొదటి పేజీ తరువాయి

భద్రత కల్పించాలనే భారతదేశ నిబద్ధతను ఆయన పునరుద్ఘాటించారు, ముఖ్యంగా యూరోపియన్ భద్రతా సంక్షోభం నేపథ్యంలో ప్రపంచ ఇంధన మార్కెట్లో ద్వంద్వ ప్రమాణాలకు వ్యతిరేకంగా హెచ్చరించారు. మాకు ఏది అవసరమో అది చేస్తాం అని మిస్రీ స్పష్టం చేశారు.

రష్యా నుంచి ముడిచమురును శుద్ధి చేసి, దాన్నుంచి వచ్చిన ఇంధనాలను, జెట్ ఫ్యూయల్ ను యూరప్‌కు ఎగుమతి చేసే భారత్, టర్కీ, యూఏఈ వంటి దేశాలపై యూరోపియన్ యూనియన్ విధించిన కొత్త ఆంక్షలు ప్రభావం చూపుతాయని అంచనా. ఇప్పటికే, భారతదేశం నుంచి యూరప్ దేశాలకు పెట్రోలియం ఉత్పత్తుల ఎగుమతులలో గణనీయమైన తగ్గుదల నమోదైంది. ఇటీవల అమెరికా కూడా రష్యా చమురును దిగుమతి చేసుకుంటే తీవ్ర ఆర్థిక పరిణామాలను ఎదుర్కోవాల్సి వస్తుందని భారతదేశం, చైనా, బ్రెజిల్ వంటి దేశాలను హెచ్చరించింది. ఈ పరిణామాలు భారతదేశం తన ఇంధన అవసరాలను తీర్చడానికి రష్యా చమురుపై ఆధారపడటం కొనసాగిస్తుందని స్పష్టం చేసింది. జాతీయ ప్రయోజనాలకే ప్రథమ ప్రాధాన్యత అని తన వైఖరిని పునరుద్ఘాటించింది.

# బీసీ రిజర్వేషన్లపై బీజేపీ పీటముడి..

## 42% సాధ్యం కాదంటున్న కమలం పార్టీ..

- మొదటి పేజీ తరువాయి

ఇలా మార్చిన ఆర్డినెన్స్ ముసాయిదా ను గవర్నర్?కు పంపగా సవరణపై ఆయన లీగల్ ఒపీనియన్ కోరినట్టు తెలిసింది. దీనిపై గవర్నర్ సంతకం చేయాల్సి ఉంటుంది. ఆయన చేస్తారా..? లేదా..? అన్నది కూడా ఇప్పుడు హాట్ టాపిక్ గా మారింది.

**కాంగ్రెస్ ప్రయత్నాలు ఫలిస్తేనే..**

బీసీలకు 42% రిజర్వేషన్లు ఇచ్చేందుకు కాంగ్రెస్ మూడు రకాల ప్రయత్నాలు చేసింది. మొదటిది కులగణన చేయడం.. హైకోర్టు ఆదేశాల మేరకు డెడికేటెడ్ క మిషన్ వేసీ క్యాస్ట్ సెన్సెస్ చేపట్టింది. అసెంబ్లీలో తీర్మానం పెట్టి పాస్ చేయించింది. ఆ తర్వాత దానిని గవర్నర్ కు పంపింది. ఆ బిల్లుపై గవర్నర్ సంతకం చేసి కేంద్రానికి పంపారు. సెప్టెంబర్ 30 లోగా స్థానిక సంస్థల ఎన్నికలు నిర్వహించాలన్న హైకోర్టు ఆదేశాల దరిమిలా మరో అస్త్రాన్ని సంధించింది. అదేమిటంటే అసెంబ్లీని, మండలిని ప్రోరోగ్ చేసి కేబినెట్ సమావేశం ఏర్పాటు చేసింది.

పంచాయతీరాజ్ యాక్ట్ %-%2018కి సవరణలు చేస్తూ కేబినెట్ లో తీర్మానం చేసింది. ఈ మేరకు ఆర్డినెన్స్ ను గవర్నర్ కు పంపింది. మరో అడుగు ముందుకు ఎంపీలతో సమావేశం నిర్వహించి బిల్లు పార్లమెంటులో ప్రవేశపెట్టి కేంద్రంపై ఒత్తిడి తెచ్చేందుకు ప్రయత్నాలు చేస్తోంది.

**ముంచుకొస్తున్న గడువు**

సెప్టెంబర్ 30 లోగా స్థానిక సంస్థల ఎన్నికలు నిర్వహించాలని ఇదివరకే హైకోర్టు రాష్ట్ర ప్రభుత్వాన్ని, రాష్ట్ర ఎన్నికల సంఘాన్ని ఆదేశించింది. స్థానిక సంస్థల ఎన్నికలు నిర్వహించాలంటే ముందు రిజర్వేషన్లు ఫైనల్ కావాల్సి ఉంటుంది. దీంతో రాష్ట్ర ప్రభుత్వం ప్రయత్నాలను ముమ్మరం చేసింది.

గ్రామ పంచాయతీలు, మున్సిపాలిటీలు, నగరపాలక సంస్థలు, మండల, జిల్లా పరిషత్ ల ఎన్నికలు నిర్వహించాల్సి ఉంది. వీటన్నింటికీ కొత్తగా వచ్చే రిజర్వేషన్లు కీలకంగా మారనున్నాయి. దీంతో పల్లె, పట్నం అంతా రిజర్వేషన్ల నిర్ణయం వైపు ఎదురు చూస్తున్నాయి.

## త్వరలోనే ట్యాంక్ బండ్‌పై దాశరథి విగ్రహం ఏర్పాటు చేస్తం

- మొదటి పేజీ తరువాయి

కవులు, రచయితలన్నారు. ఏ రాజకీయ పార్టీకి అనుబంధంగా కవులు ఉండకూడదని దాశరథి చెప్పారని.. అప్పుడే ప్రజల పక్షాన రచనలు పక్షపాతం లేకుండా రాయగలరన్నారు. అసమానతలు, దుర్మార్గ వ్యవస్థపై దాశరథి ఆనాడు తన కలం ద్వారా గళం విప్పారని కొనియాడారు. నిజాం నవాబు ఎన్ని ఇబ్బందులు పెట్టిన దాశరథి తలవంచలేదని.. అది ఆయన గొప్పతనమని ప్రశంసించారు. దాశరథి ఒక వ్యక్తి కాదు ఒక శక్తి అని అన్నారు. కవులకు రిటైర్మెంట్ ఉండదని.. సమస్య ఎక్కడ ఉంటే అక్కడ నిలదీయాలని కోరారు. స్వతంత్ర ఉద్యమం నుంచి తెలంగాణ ఉద్యమం వరకు కవుల పాత్ర కీలకమన్నారు. తెలంగాణ రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న 12వేల గ్రామ పంచాయతీల్లో దాశరథి పుస్తకాలు అందుబాటులో ఉండే విధంగా చర్యలు తీసుకుంటామన్నారు.

## స్థానిక ఎన్నికలు... రేవంత్ రెడ్డిని కలిసిన యువజన కాంగ్రెస్ అధ్యక్షుడు

- మొదటి పేజీ తరువాయి

తమ విజ్ఞప్తికి ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సానుకూలంగా స్పందించారని ఆయన తెలిపారు. రానున్న స్థానిక సంస్థల ఎన్నికలలో పార్టీ బలోపేతానికి కృషి చేసిన, అర్హత గల యువజన కాంగ్రెస్ నాయకులకు తగిన గుర్తింపునిచ్చి సీట్ల కేటాయింపులో సముచిత స్థానం కల్పిస్తామని ముఖ్యమంత్రి హామీ ఇచ్చారని తెలిపారు.

# జాతీయ స్థాయిలో కులగణన తెరపైకి రావడంలో తెలంగాణదే కీ రోల్

- మొదటి పేజీ తరువాయి

బీసీలకు 42 శాతం రిజర్వేషన్ల బిల్లుకు అసెంబ్లీలో కొన్ని పార్టీలు మద్దతు ఇచ్చాయని, అసెంబ్లీలో మద్దతు తెలిపిన పార్టీలు పార్లమెంట్లో కూడా సపోర్ట్ చేయాలని కోరారు.

ఈ బిల్లు త్వరగా ఆమోదం పొందే ప్రయత్నాలు చేస్తున్నామని వివరించారు. తెలంగాణలో కాంగ్రెస్ అధికారంలోకి వస్తే కుల గణన చేపడతామని రాహుల్ గాంధీ హామీ ఇచ్చారని.. ఆయన చెప్పిన మాట ప్రకారమే రాష్ట్రంలో పవర్?లోకి రాగానే కుల గణన నిర్వహించామని గుర్తు చేశారు. జాతీయ స్థాయిలో కులగణన అంశం తెరపైకి రావడంలో తెలంగాణ రాష్ట్రానిది కీలక పాత్ర అని పేర్కొన్నారు. తెలంగాణలో కులగణన చేసిన తర్వాతే దీనిపై దేశవ్యాప్తంగా చర్చ మొదలైందన్నారు.

కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం మొదట కులగణన వద్దని దబాయించింది కానీ తెలంగాణ సర్కార్, రాహుల్ గాంధీ ఒత్తిడికి తలొగ్గి దేశవ్యాప్త జనగణనలో కులగణన చేయాలని కేంద్ర ప్రభుత్వం నిర్ణయించిందన్నారు. కులగణన సర్వేను చాలా పకడ్బందీగా, పారదర్శకంగా నిర్వహించామని అందుకే తెలంగాణను చూసి కేంద్ర ప్రభుత్వం కూడా కుల గణన చేస్తామని ప్రకటించిందన్నారు. తెలంగాణ జరిగిన విధానమే రేపు దేశవ్యాప్తంగా అమలు కానుందన్నారు. కేంద్ర ప్రభుత్వం కులగణన, జనగణన చేయడానికి ఇంకా చాలా సమయం ఉందన్నారు. బీసీలకు 42 శాతం రిజర్వేషన్లపై ఏవైనా న్యాయపరమైన సమస్యలు వస్తే ఎదుర్కొవడానికి కూడా సిద్ధంగా ఉన్నామని స్పష్టం చేశారు.తెలంగాణ ప్రభుత్వం చేసిన కులగణన సర్వే దేశానికి మార్గదర్శకంగా నిలుస్తోందని ఆశాభావం వ్యక్తం చేశారు. కుల గణన నివేదికను కేబినెట్, శాసన సభలో ప్రవేశపెట్టి ఆమోదించామన్నారు. తెలంగాణ సర్కార్ చేసిన కులగణన దేశంలోనే చరిత్రాత్మకంగా మారిందన్నారు.

# రేవంత్ రెడ్డి ఫైట్ మోడ్ సీఎం

- మొదటి పేజీ తరువాయి

పార్టీ పరంగా రిజర్వేషన్లు ఇస్తామని ముఖ్యమంత్రి చెప్పారని, అయితే బీసీలు పార్టీల పరంగా రిజర్వేషన్లు కోరుకోవడం లేదని తెలిపారు. చట్టబద్ధమైన, రాజ్యాంగబద్ధమైన రిజర్వేషన్లను వారు కోరుకుంటున్నారని తెలిపారు. రిజర్వేషన్లు లేకుండా స్థానిక సంస్థల ఎన్నికలకు వెళితే బీసీ బిడ్డలు వారిని వదిలి పెట్టరని హెచ్చరించారు.

బీసీ రిజర్వేషన్ల అంశంపై రెండు జాతీయ పార్టీలు మోసం చేస్తున్నాయని కవిత ఆరోపించారు. బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు రామచందర్ రావు, బీజేపీ ఎంపీలు, కేంద్ర మంత్రులు బీసీ రిజర్వేషన్ల అంశంపై మాట్లాడుతున్న మాటలు బాధాకరమని అన్నారు. బీసీ రిజర్వేషన్ బిల్లును అసెంబ్లీలో పాస్ చేసి గతంలోనే పంపించినప్పటికీ రాష్ట్రపతి వద్ద పెండింగులో పెట్టి తిరిగి పంపించడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు.

బిల్లుకు మతపరమైన రంగు పులిమి బీజేపీ బిల్లును పాస్ చేయడం లేదని విమర్శించారు. గుజరాత్‌లో ఎలాంటి రిజర్వేషన్లు ఇచ్చారో అందరికీ తెలుసని, తెలంగాణ విషయంలో మాత్రం బీజేపీ మరో రకంగా వ్యవహరిస్తోందని మండిపడ్డారు.

**ఉత్తరాది రాష్ట్రాల్లో**

బీజేపీ 50 శాతానికి పైగా రిజర్వేషన్లను అమలు చేస్తోందని కవిత వెల్లడించారు. దక్షిణాది రాష్ట్రాల విషయానికి వచ్చేసరికి న్యాయస్థానాల పరిధిలో ఉందని సాకులు చెబుతోందని విమర్శించారు. బీసీ బిడ్డలను రిజర్వేషన్లకు దూరంగా ఉంచాలని బీజేపీ ప్రయత్నిస్తోందని ఆరోపించారు.

# గోల్డెన్ డోమ్ ప్రాజెక్ట్.. స్పేస్ఎక్స్‌కు ప్రత్యామ్నాయాల వేటలో ట్రంప్

- మొదటి పేజీ తరువాయి

గోల్డెన్ డోమ్ ప్రాజెక్టులో SpaceX ఆధిపత్యాన్ని తగ్గించేందుకు ఈ నిర్ణయం తీసుకుంటున్నట్లు తెలుస్తోంది. ఈ మార్పు యూఎస్ సైనిక కమ్యూనికేషన్లకు కేంద్రంగా ఉన్న స్టార్‌లింక్ ,స్టార్‌షీల్డ్ ఉపగ్రహ నెట్‌వర్క్‌లు, మస్క్ స్పేస్ఎక్స్‌పై ఆధారపడటం నుంచి వ్యూహాత్మక మలుపును సూచిస్తుంది. జూన్ 5 తర్వాత ట్రంప్, మస్క్ మధ్య బహిరంగ విభేదాలతో వారి మధ్య సంబంధాలు క్షీణించడంతో ఈ నిర్ణయం తీసుకున్నట్లు అనిపించినప్పటికీ ఈ వివాదం జరగడానికి ముందే పెంటగాన్ ,వైట్ హౌస్ అధికారులు స్పేస్ఎక్స్‌కు ప్రత్యామ్నాయాలను అన్వేషించడం ప్రారంభించారని తెలుస్తోంది. 175 బిలియన్ల డాలర్ల అంతరిక్ష ఆధారిత రక్షణ కవచంలో ప్రధాన భాగాలను ఒకే పార్టినర్ కు ఇచ్చి వారి అతిగా ఆధారపడటం మంచిది కాదని ఈ నిర్ణయానికి వచ్చినట్లు తెలుస్తోంది. స్పేస్ ఎక్స్ దాదాపు 9వేల కంటే ఎక్కువ సొంత స్టార్ లింక్ శాటిలైట్లనను ప్రయోగించిన ట్రాక్ రికార్డు ఉంది. ఇది గోల్డెన్ డోమ్ ప్రధాని భాగాలకు, ముఖ్యంగా కాంట్రాక్టులను ప్రయోగించడానికి అంతర్గత ట్రాక్ ను కలిగి ఉంది. అయితే స్పేస్ ఎక్స్ ను కాదని 3వేల తక్కువ-భూమి కక్ష్య ఉపగ్రహాల ప్రణాళికలో 78 మాత్రమే ప్రయోగించిన ప్రాజెక్ట్ కైపర్ ను ట్రంప్ సంప్రదించడం ఇది వాణిజ్య జాతీయ రక్షణ మౌలిక సదుపాయాలను అనుసంధానించేందుకు ఇప్పుడున్న స్పేస్ ఎక్స్ ను పక్కన పెట్టడమే లక్ష్యంగా పనిచేస్తున్నట్లు తెలుస్తోంది.

**గోల్డెన్ డోమ్ అంటే..**

గోల్డెన్ డోమ్ ఇజ్రాయెల్ ఐరన్ డోమ్ ను పోలి ఉంటుంది. కాకపోతే ఐరన్ డోమ్ కంటే చాలా పెద్దది, సంక్లిష్టమైన రక్షణ వ్యవస్థం. దీనికి అనేక కక్ష్యా ఉపగ్రహాల నెట్ వర్క్ అవసరం. ఇది ఎక్కువ భూభాగాన్ని కవర్ చేస్తుంది. బాలిస్టిక్, హైపర్‌సోనిక్ ,క్రూయిజ్ క్షిపణులు వంటిమిస్సైళ్లను ప్రయోగానికి ముందే గుర్తించి ధ్వంసం చేయడం గోల్డెన్ డోమ్ లక్ష్యం.

ట్రంప్ రెండో సారి అధ్యక్షుడిగా బాధ్యతలు తీసుకున్న తర్వాత గోల్డెన్ డోమ్ ప్రాజెక్టును ప్రారంభించారు. ఈ ప్రాజెక్టును వేగంగా పూర్తి చేయాలని లక్ష్యంగా పెట్టుకున్నారు. స్పేస్ ఫోర్స్ జనరల్ మైఖేల్ గెట్లీన్ఈ ప్రాజెక్టుకు నాయకత్వం వహించనున్నారు.

**కొత్త పార్టినర్లకోసం వేట.,.**

స్పేస్ఎక్స్ దాని పరిమాణం, 9వేలకంటే ఎక్కువ స్టార్‌లింక్ ఉపగ్రహాలను ప్రయోగించిన ట్రాక్ రికార్డ్ ఉంది. గోల్డెన్ డోమ్‌లోని ప్రధాన భాగాలకు ముఖ్యంగా ప్రయోగ ఒప్పందాలకు సహాయం చేసేందుకు అవకాశాలు అధికంగా ఉన్నాయి. అయితే ఈ కార్యక్రమంలో దాని వాటా తగ్గే అవకాశం ఉందని వర్గాలు చెబుతున్నాయి. ట్రంప్ పరిపాలన గోల్డెన్ డోమ్ ప్రాజెక్ట్‌ను వేగంగా ముందుకు తీసుకెళ్లేందుకు కట్టుబడి ముందుకెళ్తోంది. మస్క్ తో విభేదాలు, కొత్త రక్షణ సంస్థల ప్రవేశంతో భవిష్యత్తులో అంతరిక్ష ఆధారిత రక్షణ రంగంలో భారీ మార్పులు రానున్నాయి. ఏ కంపెనీలు ఈ కీలకమైన ప్రాజెక్ట్‌లో భాగస్వాములు అవుతాయో, ఈ క్షిపణి కవచం అమెరికా భద్రతకు ఎంత మేరకు దోహదపడుతుందో వేచి చూడాలి.

# ధన్‌ఖడ్‌కు ఏం కాలే.. ఆయన హెల్తీగా ఉన్నరు

- మొదటి పేజీ తరువాయి

ఈ క్రమంలో తన విరోధి జగదీప్ ధన్?ఖడ్ రాజీనామాపై టీఎంసీ చీఫ్, వెస్ట్ బెంగాల్ సీఎం మమతా బెనర్జీ సంచలన వ్యాఖ్యలు చేశారు. జగదీప్ ధన్‌ఖడ్ ఆరోగ్యకరమైన వ్యక్తి అని.. ఆయన పూర్తిగా క్షేమంగా ఉన్నారని ఇంట్రెస్టింగ్ కామెంట్ చేశారు. ఆయన రాజీనామాకు అనారోగ్యం కారణం కాకపోవచ్చని అనుమానం వ్యక్తం చేశారు దీదీ.

“జగదీప్ ధన్‌ఖడ్ రాజీనామా గురించి నేను ఎటువంటి వ్యాఖ్యలు చేయాలనుకోవడం లేదు. ఏమి జరుగుతుందో చూద్దాం. కానీ జగదీప్ ధన్‌ఖడ్ ఆరోగ్యకరమైన వ్యక్తి. ఆయన ఆరోగ్యం పూర్తిగా బాగుందని నేను భావిస్తున్నాను” అని పేర్కొన్నారు. పరోక్షంగా జగదీప్ ధన్‌ఖడ్ రాజీనామాకు అనారోగ్యం కాదన్నారు దీదీ.

కాగా, 2019 నుంచి 2022 వరకు జగదీప్ ధన్‌ఖడ్ పశ్చిమ బెంగాల్ గవర్నర్‌గా పని చేసిన విషయం తెలిసిందే. ఈ సమయంలో జగదీప్ ధన్?ఖడ్ వర్సెస్ మమతా బెనర్జీ అన్నట్లు పరిస్థితులు ఉండేవి. అసెంబ్లీ, రాజ్ భవన్ మధ్య గడ్డి వేస్తే భగ్గుమనేలా ఉండేది సిట్యూయేషన్. గవర్నర్ ధన్ ఖడ్, సీఎం మమతా బెనర్జీ బహిరంగంగానే మాటల తుటాలు పేల్చుకునేవారు. కాగా, భారత ఉప రాష్ట్రపతి పదవికి జగదీప్ ధన్‌ఖడ్ 2025, జూలై 21న రాజీనామా చేసిన విషయం తెలిసిందే. ఈ మేరకు రిజైన్ లెటర్ ను రాష్ట్రపతి ద్రౌపది ముర్ముకు పంపించారు. తక్షణమే తన రాజీనామాను ఆమోదించాలని కోరారు. ఈ క్రమంలో 2025, జూలై 22న జగదీప్ ధన్‌ఖడ్ రాజీనామాను రాష్ట్రపతి ద్రౌపది ముర్ము ఆమోదించారు. 24 గంటల వ్యవధిలోనే రాజీనామా, రాజీనామాకు ఆమోదం తెలపడం అన్ని చకచకా అయిపోయాయి.

## బెట్టింగ్ యాప్ కేసు.. ఈడీని సమయం కోరిన రానా దగ్గుబాటి, మంచు లక్ష్మి

- మొదటి పేజీ తరువాయి

షూటింగ్ బిజీ కారణంగా తన షెడ్యూల్‌ను మార్చాలని విజ్ఞప్తి చేశారు. మంచు లక్ష్మి ఆగస్టు 13న ఈడీ అధికారుల ముందు హాజరు కావాల్సి ఉంది. అయితే, తాను కూడా ఆ రోజు హాజరు కాలేనని మంచు లక్ష్మి ఈడీకి సమాచారం ఇచ్చినట్లు తెలుస్తోంది.

ఈ వ్యవహారంలో ప్రకాశ్ రాజ్ జులై 30న, విజయ్ దేవరకొండ ఆగస్టు 6న ఈడీ ఎదుట హాజరు కావాల్సి ఉంది. బెట్టింగ్ యాప్‌ల ప్రమోషన్లపై గతంలో నమోదైన కేసుల ఆధారంగా ఈడీ దర్యాప్తు చేస్తోంది. పంజాగుట్ట, మియాపూర్, సూర్యాపేట, విశాఖపట్నంలో నమోదైన కేసుల ఆధారంగా విచారణ జరుపుతోంది. 29 మంది సినీ నటులు, యూట్యూబర్లు, ఇన్‌ఫ్లుయెన్సర్లపై ఈడీ కేస్ ఇన్ఫర్మేషన్ రిపోర్టు (ఈసీఐఆర్) నమోదు చేసింది.

# ధన్ ఖడ్ రాజీనామాకు రాష్ట్రపతి ఆమోదం

- మొదటి పేజీ తరువాయి

సజావుగా నిర్వహించారు. తొలిరోజు కార్యకలాపాలు ముగిసి సభ మంగళవారానికి వాయిదా పడిన తర్వాత ధన్ ఖడ్ తన రాజీనామా నిర్ణయాన్ని ప్రకటించారు. అనారోగ్య కారణాల వల్ల ఉపరాష్ట్రపతి పదవికి రాజీనామా చేస్తున్నట్లు చెప్పారు. ఈ మేరకు రాష్ట్రపతి ద్రౌపది ముర్ముకు ఆయన రాజీనామా లేఖను సమర్పించారు. తన రాజీనామాను వెంటనే ఆమోదించాలని రాష్ట్రపతిని కోరారు. కాగా, ఉపరాష్ట్రపతితో పాటు పలు పదవులు నిర్వర్తించిన జగదీప్ ధన్ ఖడ్ దేశానికి ఎంతో సేవలందించారని ప్రధాని నరేంద్ర మోదీ కొనియాడారు. ధన్ ఖడ్ రాజీనామాకు రాష్ట్రపతి ముర్ము ఆమోదం తెలిపిన తర్వాత ప్రధాని మోదీ ఈ మేరకు ట్వీట్ చేశారు.

## హెచ్‌సీఏ విషయంలో దుష్ప్రచారం చేయవద్దు

- మొదటి పేజీ తరువాయి

సమాచారాన్ని సీఐడీ అధికారికంగా విడుదల చేస్తుందని ఆమె వెల్లడించారు. అసత్య ప్రచారాలు చేస్తే మాత్రం ఉపేక్షించేది లేదని ఆమె ఒక ప్రకటనలో తెలిపారు. హెచ్‌సీఏ కేసులో అధ్యక్షుడు జగన్మోహన్ రావు, ట్రెజరర్ శ్రీనివాసరావు, సీఈవో సునీల్, అధికారి రాజేందర్ యాదవ్, ఎమ్మెల్సీ కవితపై ఆరోపణలు ఉన్నాయి. వీరంతా 23 ఇన్ స్టిట్యూషనల్ ఓట్లను అక్రమంగా వేయించినట్లు సీఐడీ గుర్తించింది. అయితే ఐఏఎస్, ఐపీఎస్ అధికారులు ఓటింగులో పాల్గొన్నారన్న ఆరోపణలను చారుసిన్హా ఖండించారు.

## వంచుల పంచాయతీలో పీ-4 గ్రామసభ నిర్వహణ



**గూడెం కొత్తవీధి,పెన్ పవర్, జూలై 22:** అల్లూరి సీతారామరాజు జిల్లా గూడెం కొత్తవీధి మండలంలోని వంచుల పంచాయతీలో మంగళ వారం ప్రభుత్వం ఆదేశాల మేరకు పీ-4 గ్రామసభ నిర్వహించారు. ఈ కార్యక్రమాన్ని పంచాయతీ సర్పంచ్ వనపల కాసులమ్మ, గ్రామ సచివాలయ సెక్రటరీ శివ,కూటమి నేతలలు మండలం టీడీపి అధ్యక్షులు పొత్తూరు కొండల రావు ఆధ్వర్యంలో నిర్వహించారు. గ్రామసభలో మాట్లాడుతూ "పేదరికం లేని సమాజం సాధించడమే ప్రభుత్వ లక్ష్యం. ఈ దిశగా చేపట్టిన పీ-4 కార్యక్రమం 'జిరో పావర్టీ %-% బంగారు కుటుంబం' లక్ష్యంగా పనిచేస్తోంది," అని తెలిపారు. పీ-4 అంటే పబ్లిక్, ప్రైవేట్, పీపుల్ పార్టనర్‌షిప్‌తో అభివృద్ధిని సాధించే కార్యక్రమమని పేర్కొన్నారు. "ఇది డబ్బులు ఇచ్చే కార్యక్రమం కాదు, ప్రజల భాగస్వామ్యంతో సుస్థిర అభివృద్ధి సాధించాలన్న దిశగా ముందుకెళ్తోంది," అని అన్నారు.ఈ కార్యక్రమంలో ఉప సర్పంచ్ చల్లంగి శ్రీధర్, టీడీపి నేతలు ముర్ల కోటి,వైసీపీ నాయకులు వనపల రాజేష్,లొంజా గణపతి,అరడా సత్తి బాబు, పాంగి చిట్టీ బాబు, జనసేన నాయకులు,వార్డ్ సభ్యులు ఆశా అంగన్వాడీ కార్యకర్తలు,విఆర్పిలు బి.వెంకట్రావు, కాంతారావు, సచివాలయం సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## కల్తీ మద్యంపై వాస్తవాలను వెల్లడించాల్సిన బాధ్యత పోలీస్ ఎక్సైజ్ శాఖ అధికారులదే.

- పెందుర్తి ఎమ్మెల్యే పంచకర్ల రమేష్ బాబు.



**పరవాడ(పెన్ పవర్) జూలై 22:** కల్తీ మద్యం పై వచ్చిన ఆరోపణలు సంబంధించి వాస్తవాలు వెల్లడించాల్సిన బాధ్యత పోలీస్ ఎక్సైజ్ శాఖ అధికారులదే అని పెందుర్తి ఎమ్మెల్యే పంచకర్ల రమేష్ బాబు స్పష్టం చేశారు. మంగళవారం స్థానిక జనసేన పార్టీ కార్యాలయంలో విలేకరుల సమావేశాన్ని నిర్వహించి వివిధ అంశాలపై మాట్లాడారు.మధ్య%శీ%లో స్పిరిట్ కలిపి మద్యాన్ని కల్తీ చేసి బెల్ట్ షాపుల ద్వారా విక్రయిస్తున్నారని వస్తున్న వార్తల నేపథ్యంలో దర్యాప్తు జరిపిన ఎక్స్చేంజ్ పోలీస్ శాఖ ఇంతవరకు వాస్తవాలను ఎందుకు వెల్లడించలేదని ప్రశ్నించారు. మద్యం కల్తీ వ్యవహారంలో పరవాడ ప్రాంతానికి చెందిన వారిపై కూడా ఆరోపణలు రావడం, నిందితులకు అధికార పార్టీ నాయకులు కొమ్ము కాస్తున్నారని పత్రికల్లో కదనాల రావడం బాధాకరమన్నారు. ఈ నేపథ్యంలో ప్రెస్ మీట్ పెట్టి వాస్తవాలను ప్రజలకు తెలియజేయాలనే ఉద్దేశంతో నాలుగు రోజుల క్రితం ప్రెస్ మీట్ పెడుతున్నట్లు ప్రకటించమన్నారు. కానీ ఎక్సైజ్ శాఖ అధికారులు కేసు దర్యాప్తులో ఉంది కాబట్టి పూర్తయిన తర్వాత అన్ని వివరాలు ఇస్తామని అప్పుడు ప్రజలకు చెబుదురుగాని అని చెప్పిన నేపథ్యంలో ప్రెస్ మీట్ ను రద్దు చేసుకున్నట్లు తెలిపారు. కానీ 15 రోజులు గడుస్తున్న ఇంతవరకు వాస్తవాలను అధికారులు ప్రజలకు తెలియ పరచకపోవడం వెనుక ఉన్న ఆంతర్యం ఏంటని ప్రశ్నించారు. రెండు మూడు రోజుల్లో మద్యం కల్తీ కేసుపై వాస్తవాలను ప్రజలకు వెల్లడించాలని లేని పక్షంలో తాను ఏం చేయాలో అది చేస్తానని ఎక్సైజ్ పోలీస్ శాఖ అధికారులను హెచ్చరించారు.

## పది రోజుల్లో బొగ్గు లారీల సమస్య పరిష్కరించకపోతే ప్రజల తరఫున పోరాటం చేస్తా.

- పెందుర్తి ఎమ్మెల్యే పంచకర్ల.



**పరవాడ (పెన్ పవర్ )జూలై 22:** లంకెలపాలెం జంక్షన్ మీదుగా ప్రతిరోజు ప్రయాణిస్తున్న బొగ్గు ఫ్లైయాష్ లారీలు నిబంధనలకు విరుద్ధంగా అదిగా లోడులతో కనీసం తార్పల్లిన్స్ కూడా కట్టకుండా అతి వేగంగా ప్రయాణం చేయడం పై పెందుర్తి శాసనసభ్యుడు పంచకర్ల రమేష్ బాబు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. మంగళవారం స్థానిక జనసేన పార్టీ కార్యాలయంలో విలేకరుల సమస్య నిర్వహించి మాట్లాడారు. ఎన్నికల సమయంలో లంకెలపాలెం చుట్టు గ్రామాల ప్రజలు బొగ్గు, ప్లాయాస్ లారీల నుండి వెలువడే కాలుష్యం బారి నుండి తమను రక్షించాలని కోరారని తెలిపారు . అధికారంలోకి రాగానే సమస్య పరిష్కరిస్తానని తాను మాట ఇచ్చానన్న విషయాన్ని గుర్తు చేశారు. అధికారంలోకి వచ్చి వెంటనే హిందూజా సింహాద్రి ఎన్టీపీసీ ప్రతినిధులకు రాతపూర్వక ఫిర్యాదు కూడా చేశానని అన్నారు. ఎస్పీ డీఎస్పీ దృష్టికి కూడా తీసుకు వెళ్లాను అని అన్నారు. కానీ ఇంతవరకు సమస్య పరిష్కారం కాలేదు అని అన్నారు. వారం రోజుల్లో సమస్య పరిష్కారం కాకపోతే ప్రజల తరఫున తాను పోరాటం చేస్తానని హెచ్చరించారు. పరిస్థితిని అంతవరకు తీసుకురానీ వద్దని అధికారులను కోరారు. తాడి తరలింపు ప్రక్రియ పకడ్బందీగా కొనసాగుతుందని తెలిపారు. ఎన్టిపిసి, ఫార్మాసిటీ, పరిశ్రమల్లో స్థానికులకు ఉపాధి అవకాశాలు కల్పించాలని ఏడాదికాలంగా అభ్యర్థిస్తున్నా ఆ దిశగా పారిశ్రామిక ప్రతినిధులు చర్యలు తీసుకోకపోవడం దురదృష్టకరం అన్నారు. త్వరలోనే ఆర్డీవో జిల్లా కలెక్టర్ తో సమావేశం అవుతానని అప్పటికి స్థానిక ఉద్యోగ ఉపాధి అవకాశాలు సమస్య పరిష్కారం కాకపోతే తాను ఆందోళన చేయడానికి కూడా వెనకాడనని హెచ్చరించారు.

# హరి హర వీరమల్లు సినిమా విజయవంతం అవ్వాలని పూజలు చేసిన పెందుర్తి ఎమ్మెల్యే పంచకర్ల .





**పరవాడ(పెన్ పవర్) జూలై 22:** జనసేన అధినేత ఉపముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ నటించిన హరిహర వీరమల్లు సినిమా విజయవంతం అవ్వాలని పెందుర్తి ఎమ్మెల్యే పంచకర్ల రమేష్ బాబు మంగళవారం పరవాడ సినిమా హాల్ జంక్షన్లో ఉన్న పంచముఖ అభయాంజనేయ స్వామి ఆలయంలో ప్రత్యేక పూజలు చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ పవన్ కళ్యాణ్ ఉపముఖ్యమంత్రిగా బాధ్యతలు తీసుకున్న ఏడాది తర్వాత ఈనెల 24 అనగా గురువారం విడుదల కాబోతున్న సినిమా హరిహర వీరమల్లు అని అన్నారు. ఈ సినిమా మెసేజ్ ఓరియంటెడ్ మూవీ అని ఇది రెండు భాగాలుగా విడుదల కాబోతుందని అన్నారు. మొదటి భాగం గురువారం విడుదల అవుతుందని అన్నారు. ఓ పోరాటం యోధుడి కథను తీసుకొని చిత్రీకరించడం జరిగిందన్నారు. దేశభక్తితో నిండి ఉన్న ఈ చిత్రం విజయవంతం కావాలని పంచముఖ ఆంజనేయ స్వామిని కోరుకున్నట్లు తెలిపారు. రాష్ట్రానికి, దేశానికి ఉపయోగపడే సినిమా కాబట్టి ప్రతి ఒక్కరు ఆదరించాలని కోరారు. ఈ కార్యక్రమంలో మాజీ మండల అధ్యక్షులు పైలా జగన్నాథరావు, మాస వరపు అప్పలనాయుడు, మండల జనసేన పార్టీ అధ్యక్షులు బొద్దపు శ్రీనివాసరావు , మండల టిడిపి అధ్యక్షులు వియ్యపు చిన్న , పరవాడ గ్రామ సర్పంచ్ సిరపరపు అప్పలనాయుడు , తానం గ్రామ సర్పంచ్ కన్నూరు దేవి వెంకట రమణ, ముత్యాలంపాలెం గ్రామ సర్పంచ్ చింతకాయల సుజాత ముత్యాలు , విశాఖ రూరల్ జిల్లా జనసేన పార్టీ కార్యదర్శి బుగుడి రామ గోవిందరావు, రెడ్డి శ్రీనివాసరావు,రాపర్తి కిషోర్ , ,బంటు సురేష్ , అనిల్ , సన్నీ బాబు , రామచంద్ర రావు , బొద్దపు అయ్యబాబు , వర్రీ పరదేశి నాయుడు , వెన్నెల సన్యాసినాయుడు , బెగిడి రామ గోవింద , కెఎన్ఆర్ ,పావని ,పిచికారి లక్ష్మీ ,సర్వసిద్ధి సన్యాసి రాజు,రామారావు జనసేన కార్యకర్తలు ప్రజలు తదితరులు పాల్గొన్నారు.

## శ్రీ రాజరాజేశ్వరి అమ్మవారి చతుర్థ వార్షికోత్సవానికి భారీ ఏర్పాట్లు.

- ఈనెల 25 నుండి 27 వరకు అమ్మవారికి ప్రత్యేక పూజలు.

**పరవాడ(పెన్ పవర్) జూలై 22 :** జవహర్లాల్ నెహ్రూ ఫార్మాసిటీ రాంకీ కమర్షియల్ హబ్ సమీపంలో ఉన్న శ్రీ గణపతి, సుబ్రహ్మణ్య, శ్రీ చక్ర సహిత రాజరాజేశ్వరి అమ్మవారి చతుర్థ వార్షికోత్సవాన్ని ఘనంగా నిర్వహించడానికి భారీ ఏర్పాట్లు చేస్తున్నట్లు ఆలయ కమిటీ ప్రతినిధులు మంగళవారం విడుదల చేసిన ఆహ్వాన పత్రిక ప్రకటనలో తెలిపారు. ఈ నెల 25 నుండి 27 వరకు అమ్మవారి ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఈ సందర్భంగా ఆలయాన్ని అందంగా అలంకరిస్తున్నారు. ఆలయాన్ని కొత్త రంగులతో, విద్యుత్ దీపాలతోను, వివిధ రకాల పుష్పాలతో అమ్మవారి ఆలయాన్ని ముస్తాబు చేస్తున్నట్లు తెలిపారు. 25 న అనగా శుక్రవారం ఉదయం 9:10 నిమిషాలకు ఆలయ ప్రదక్షిణ, గోపూజ, భూత బలి, యాగశాల ప్రవేశం గణపతి పూజ, పుణ్యాహవచనం, పంచ గవ్యారాధన, రిత్విక్ వరుణలు, దీక్షారాధన, మార్జనలు, అస్త్ర రాజార్చన, ప్రధాన కుంభావాహన వంటి పూజలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. 26న శనివారం ఉదయం 8 గంటల నుండి గవ్యాంత మార్జనలు, పున పూజలు, వాస్తు మండపారాధన, వాస్తు బలి, వాస్తు హెూమం, అష్టోత్తర కలసారాధన, శ్రీ చక్రార్చన పూజలు అదేరోజు మధ్యాహ్నం 2:30 గంటలకు ఉదకశాంతి, చండీ హెూమం, కళా హెూమాలు, మూల మంత్ర హెూమాలు, ఖడ్గమాల హెూమం, నీరాజన మంత్ర పుష్పములు, చతుర్వేది స్వస్తి ప్రసాద వితరణ వంటి కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. చివర రోజు 27 ఆదివారం ఉదయం 7:30 గంటలకు గవ్యాంత మార్జనలు, పునః పూజలు, శ్రీ రాజరాజేశ్వరి అమ్మవారికి విశేష ద్రవ్య పూర్వక అష్టోత్తర కళాభిషేకం, విశేష అలంకరణ, మహా



పూర్ణాహుతి, ఆలయ శిఖరానికి కుంభాభిషేకం, గోదృష్టి, అమ్మవారికి కుంకుమ పూజ, తదితర పూజలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు.

కావున చుట్టు పక్కల గ్రామాల ప్రజలు, ఫార్మాసిటీలోని వివిధ పరిశ్రమలకు చెందిన ప్రతినిధులు, కార్మికులు, పెద్ద సంఖ్యలో పాల్గొని అమ్మవారి చతుర్థ వార్షికోత్సవ ఉత్సవాల్లో పాల్గొని విజయవంతం చేయాలని ఆలయ కమిటీ ప్రతినిధులు కోరారు.

## చేసింది తక్కువే.. చెప్పుకుందే ఎక్కువ.

- కూటమి ప్రభుత్వ పనితీరుపై అడ్డాకుల చిన్నారావు ఎద్దేవా..



**గుమ్మలక్ష్మీపురం. జులై 22.పెన్ పవర్.** సీఎం చంద్రబాబు అధినాయకత్వం లో గల కూటమి ప్రభుత్వం అధికారం చేపట్టి యేడాది పూర్తి కావచ్చినప్పటికి ప్రజలకు మరి ముఖ్యంగా రైతులు,కార్మికులు, నిరుద్యోగులు,ఉద్యోగ ఉపాధ్యాయులకు ఒరగబెట్టిందేమీ లేదని.. సరి కదా? సుపరిపాలన పేరిట గడప తొక్కే కార్యక్రమానికి శ్రీకారం చుట్టి 'ఔరా ' అనిపించుకుంటున్నారని కురుపాం నియోజకవర్గం కాంగ్రెస్ పార్టీ కో-ఆర్డినేటర్ అడ్డాకుల చిన్నారావు ఎద్దేవా చేశారు.ఈ మేరకు మంగళవారం ఆయన గుమ్మలక్ష్మీపురంలో స్థానిక విలేకరులతో మాట్లాడుతూ రైస్ కార్డులు,పింఛన్లు,వివిధ రకాల ధ్రువీకరణ పత్రములు క్షేత్రస్థాయిలో గ్రామ/వార్డు సచివాలయపు సేవలు సామాన్య ప్రజలకు అందుబాటులోకి తీసుకురావడంలో "అప్పన్న పేరిట"కాలయాపన చేస్తోందని,తద్వారా అర్హులు కూటమి ప్రభుత్వం అందించే అరకొర సంక్షేమ పథకాలను సైతం పొందుకోలేకపోతున్నారని ఆయన మండిపడ్డారు.కాగా, ఎన్నికలలో ఉద్యోగులకు ఇచ్చిన హామీ మేరకు పి ఆర్ సి కమిషన్ను నియమించకపోవడం,రావలసిన బకాయిలు,మూడు డిఏలు ఇప్పటికే పెండింగ్లో పెట్టడం,పదోన్నతుల కోసం వేచి ఉన్న ఉద్యోగుల కొరకు జాయింట్ స్టాఫ్ కమిటీని ఏర్పాటు చేయకపోవడం వంటి అపరిష్కృత సమస్యల దృష్ట్యా ప్రభుత్వంపై ఉద్యోగులు అసంతృప్తితో ఉన్నారని పేర్కొన్నారు.వెరసి గిరిశిఖర గ్రామాలల్లో సరైన రహదారులు లేక ఇప్పటికినీ "డోలీలమోతలు. తప్పడం లేదని క్షేత్రస్థాయిలో ప్రజలకు అందించాల్సిన అత్యవసర సేవలను గాలికి వదిలేసి,యోగాంధ్ర,మెగా పిటిఎం,అమరావతిలో ఐకాన్,క్వాంటం వ్యాలీ వంటి నిర్మాణాలకు తహతహలాడుతూ లక్షల కోట్లు మంజూరు అంటూ కూటమి ప్రభుత్వం చేపట్టే ప్రతి చిన్న పనికి భూతద్దంలో చూపిస్తూ"గిన్నిస్ రికార్డ్"లలో నమోదయ్యేంతగా తమకు తామే డిక్లరేషన్లు ఇచ్చుకోవడం విడ్డూరంగా ఉందని,దీనిని కాంగ్రెస్ పార్టీ తీవ్రంగా నిరసిస్తోందని చిన్నారావు తెలిపారు.

## అకాడమిక్ మోనిటరింగ్ విభాగానికి ప్రతిపాదనలు సిద్ధం చేయండి





- జిల్లా కలెక్టర్ ఎ.ఎస్.దినేష్ కుమార్

**స్టాఫ్ రిపోర్టర్,పాడేరు/గూడెం కొత్త వీధి,పెన్ పవర్,జూలై 22:** అకాడమిక్ మోనిటరింగ్ విభాగానికి ప్రతిపాదనలు సిద్ధం చేయాలని జిల్లా విద్యాశాఖ అధికారి పి. బ్రహ్మాజీ రావు, సమగ్ర శిక్ష ఎపిసి స్వామి నాయుడులను జిల్లా కలెక్టర్ ఎ.ఎస్.దినేష్ కుమార్ ఆదేశించారు.జిల్లా కలెక్టర్ మంగళవారం ఉదయం పిఎమ్ఆర్సి సముదాయంలో గల కార్యాలయాలు ఆహార భద్రత, ఇంజనీరింగ్, ఉపాధి కల్పన, జిల్లా విద్యాశాఖ, సమగ్ర శిక్ష కార్యాలయాలను సందర్శించారు.విధులు నిర్వహిస్తున్న ఉద్యోగి విధుల గూర్చి ఆరా తీశారు. అనంతరం ట్రైబల్ వెల్ఫేర్ ను సందర్శించి విద్యార్థుల అభ్యాసన, సామర్థ్యాలను తెలుసుకొని వాటిని పెంచేందుకు కావలసిన దిశా నిర్దేశాలు చేసే విధంగా ప్రతిపాదనలు సిద్ధం చేయాలన్నారు.సమగ్ర శిక్ష, గిరిజన విద్య విభాగంలతో సమన్వయపరచుకొని కార్యాచరణ ప్రణాళికలు సిద్ధం చేయాలని కలెక్టర్ సూచించారు. పిఎమ్ఆర్సి భవనాన్ని పరిశీలించి మౌలిక సదుపాయాలపై ఆరా తీశారు. ఐటిడిఎ పాడేరు పిఎమ్ఆర్సిలో విధులు నిర్వహిస్తున్న ఎఎంఓ, సిఎమ్ఓలను సమగ్ర శిక్ష కార్యాలయంలో పనిచేయాలని సూచించారు. జిల్లా స్థాయిలో మంచి సబ్జెక్టు ఉన్న టీచర్లను గుర్తించి గ్రేడింగ్ ఇవ్వాలని సూచించారు.ఈ పర్యటనలో జిల్లా విద్యాశాఖ అధికారి పి.బ్రహ్మాజీ రావు, సమగ్ర శిక్ష ఎపిసి స్వామి నాయుడు తదితరులు పాల్గొన్నారు.

# కెమిశీల హెచ్ ఎం కు షోకాజ్ నోటీసు..

**కురుపాం / కొమరాడ/పార్వతీపురం, పెన్ పవర్,జూలై 22 :** కొమరాడ మండలం కెమిశీల గిరిజన సంక్షేమ ఆశ్రమ ఉన్నత పాఠశాల నిర్వహణ పట్ల సంతృప్తి వ్యక్తం చేసిన పార్వతీపురం ఐటిడిఎ ప్రాజెక్టు అధికారి మరియు పార్వతీపురం సబ్ కలెక్టర్ అశుతోష్ శ్రీవాస్తవ, ఆ పాఠశాల ప్రధానోపాధ్యాయునికి షో కాజ్ నోటీసు జారీ చేయాలని ఆదేశాలు జారీ చేశారు.

మంగళవారం కెమిసిల పాఠశాలను, పలు అభివృద్ధి కార్యక్రమాలను ఆకస్మికంగా ప్రాజెక్టు అధికారి తనిఖీ చేశారు. పాఠశాలలో విద్యార్థుల హాజరు పట్టీని తనిఖీ చేసిన ప్రాజెక్టు అధికారి సగానికి పైగా విద్యార్థులు హాజరు కాకపోవడాన్ని గమనించారు. మధ్యాహ్న భోజనంను పరిశీలించిన ప్రాజెక్టు అధికారి ఆహార పదార్థాల నాణ్యత, పరిమాణం పట్ల అసంతృప్తి వ్యక్తం చేశారు. మెనూ ప్రకారం ఆహార పదార్థాలను తయారు చేయకపోవడం పట్ల ఆగ్రహం వ్యక్తం చేశారు. పిల్లల హాజరు పట్టితో సహా ఇతర రిజిస్టర్ల నిర్వహణ లేకపోవడం పట్ల ప్రశ్నించారు. పాఠశాల ఆవరణ తుప్పలు, డొంకలతో నిండి ఆహ్లాదకరంగా లేకపోవడాన్ని గుర్తించి ప్రధాన ఉపాధ్యాయుడిని ప్రశ్నించారు. కొమరాడ మండల పరిషత్ అభివృద్ధి అధికారికి అక్కడ నుండే ఫోన్





చేసి పరిసరాల శుభ్రతకు చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. పాఠశాల నిర్వహణ, విద్యార్థుల విద్యా ప్రమాణాలు, ఆహారం తదితర అంశాల నిర్వహణ సంతృప్తికరంగా లేకపోవడంతో షో కాజ్ నోటీసు జారీ చేయాలని గిరిజన సంక్షేమ శాఖ ఉప సంచాలకులను ఆదేశించారు. ప్రధాన ఉపాధ్యాయులు, ఉపాధ్యాయులు పాఠశాల నిర్వహణ పట్ల శ్రద్ధ వహించాలని ఆయన అన్నారు. పాఠశాల పరిసరాలు పరిశుభ్రంగా ఉండాలని ఆయన స్పష్టం చేశారు. విద్యార్థుల విద్యాప్రమాణాలు, ఆహార వసతులు, ఆరోగ్యం పట్ల నిర్లక్ష్యం వహిస్తే సహించేది లేదని ఆయన స్పష్టం చేశారు. సంబంధిత ఉపాధ్యాయులపై కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. గిరిజన సంక్షేమ ఉప సంచాలకులు తరచూ తనిఖీలు నిర్వహించి ఆశ్రమ పాఠశాలలు మంచి ప్రమాణాలతో ఉండే విధంగా చర్యలు తీసుకోవాలని ఆయన ఆదేశించారు.

గుండ - బిన్నిడి రహదారి పరిశీలన

పర్యటనలో భాగంగా మండలంలో గుండ - బిన్నిడి రహదారిని ప్రాజెక్టు అధికారి తనిఖీ చేశారు. ఎగువ గుండ - సవర గుండ రహదారిని కూడా తనిఖీ చేశారు.

ఈ కార్యక్రమంలో సంబంధిత సిబ్బంది పాల్గొన్నారు.

# షెడ్యూల్డ్ ప్రాంత నియామకాల చట్టం చేయాలి, టిఎసి భవన్ నిర్మించాలి:ఆదివాసీ పార్టీ



**గూడెం కొత్తవీధి,పెన్ పవర్, జూలై 22:**షెడ్యూల్డ్ ప్రాంత నియామకాల చట్టం చేయాలని,టిఎసి భవన్ నిర్మించాలని భారత్ ఆదివాసీ పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు మొట్టడం రాజబాబు ఆంధ్ర ప్రదేశ్ రాష్ట్ర ప్రభుత్వానికి కోరారు.పాడేరు ఐటీడీఏ సమావేశమందిరంలో ఆంధ్ర ప్రదేశ్ గిరిజన సంక్షేమ శాఖ డైరెక్టర్ సదాభార్గవి అధ్యక్షతన జరిగిన వర్క్ షాప్ లో రాజబాబు పాల్గొని వినతి పత్రాన్ని అందించారు.నెహ్రూ పంచశీలగా ప్రసిద్ధి చెందిన 1952 నేషనల్ ట్రైబల్ పాలసీ,1986 జాతీయ విద్యా విధానం (నేషనల్ ఎడ్యుకేషన్ పాలసీ)ను అనుసరించి షెడ్యూల్డ్ ప్రాంతంలో శత శాతం ఉద్యోగాలు కల్పించేందుకు జిఓ నెం 275, జిఓ నెం3 లను ప్రభుత్వం ఇవ్వడం జరిగిందని,రకరకాల కారణాలు చూపించడంతో జిఓ 3ని సుప్రీం కోర్టు రద్దు చేసింది.జిఓ 3 మీద సుప్రీం కోర్టులో రివ్యూ పిటిషన్ వేసి,కేసు కోర్టులో ఉన్నప్పటికీ షెడ్యూల్డ్ ప్రాంతాల్లో ఉద్యోగ నియామకాల నోటిఫికేషన్ రూల్ ఆఫ్ రిజర్వేషన్ అనుసరించి ప్రభుత్వం ఇవ్వడంతో షెడ్యూల్డ్ ప్రాంత ఆదివాసీ నిరుద్యోగుల తీవ్రంగా నష్టపోతున్నారు.షెడ్యూల్డ్ ప్రాంతాల్లోకి వచ్చే గిరిజనేతరుల వల్ల షెడ్యూల్డ్ ప్రాంతంలో ఉండే భూబదాలయింపు నిషేధ చట్టం(1/70చట్టం)ఉల్లంఘించబడుతుందని,ఒక అధ్యయనంలో ఆదివాసి సంస్కృతీ,సాంప్రదాయాలు అంతరించిపోయే దశలో ఉండడానికి షెడ్యూల్ ప్రాంతానికి ఉద్యోగరీత్యా వచ్చిన చిన్న చిన్న గిరిజనేతర ఉద్యోగులు, ఉపాద్యాయులే కారణమని తేలింది.రాష్ట్ర క్యాడర్ పోస్టులు 30%, జోనల్ క్యాడర్ పోస్టులు 50%, లోకల్ క్యాడర్ పోస్టులు పూర్తిగా స్థానిక ఎస్టీలకు ఇచ్చేందుకు కొత్త చట్టం ఆర్టికల్ 244 (1) క్లాజ్ 5(2) ప్రకారం టీఎసి ద్వారా చేసుకోవచ్చు.గిరిజన సలహా మండలి(టిఎసి)సభ్యులందకి ఈ చట్టం తయారు చేసుకునే విధానం పై అవగాహన కల్పించాలని,టిఎసి భవనాన్ని అసెంబ్లీ పక్కనే నిర్మించాలని,

టిఎసి అడ్మినిస్ట్రేటివ్ స్టాఫ్ ని నియమించాలని,షెడ్యూల్ ప్రాంతానికి సంబంధించిన ఎస్టీలనే టిఎసి సభ్యులుగా నియమించాలని,షెడ్యూల్ ప్రాంత ఉద్యోగ నియామకాల చట్టం చేయాలని, షెడ్యూల్ ప్రాంతంలో ఉపాధ్యాయ ఉద్యోగాలను మెగా డీఎస్సి 2025 నుండి మినహాయించాలని, షెడ్యూల్ ప్రాంతానికి ప్రత్యేక డిఎస్సీ నోటిఫికేషన్ విడుదల చేయాలని, గిరిజన సంక్షేమ శాఖ స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ కార్యాలయంలో పూర్తి సిబ్బందిని నియమించి వారి చేత ఎల్టీఆర్ చట్టాన్ని పటిష్ఠంగా అమలు చేయించాలని,

ఏస్డిసీ కార్యాలయాల్లో సిబ్బంది డిప్యూటేషన్లను రద్దు చేసి ప్రతి నెల ఎన్ని కేసులు ఫైల్ చేశారూ, ఎంతమందిని సెక్షన్ 6ఎ ప్రకారం అరెస్టు చేశారని సమీక్ష చేయాలని,ఈ సమీక్షకు ఆదివాసి నాయకుల్ని అధికారికంగా ఆహ్వానించాలని, 2013 భూసేకరణ చట్టాన్ని పటిష్ఠంగా అమలు చేయాలని, ఎల్టీఆర్ భూములను సేకరించి కోట్లు కొల్లగొడుతున్న దళారులు అధికారులు ప్రజాప్రతినిధులపై కఠినమైన చర్యలు తీసుకోవాలని వినతి పత్రంలో ఆయన డిమాండ్ చేసారు.ఈ కార్యక్రమంలో ఆదివాసీ సంఘాల నాయకులు,పలు రాజకీయ పార్టీలు నాయకులు,ప్రజాప్రతినిధులు హాజరయ్యారు.

# జిఓ నెం 3 పునరుద్ధరణపై జనసేన పార్టీ తరఫున వినతిపత్రం

- గిరిజన నిరుద్యోగ యువతకు న్యాయం చేయాలి
- జనసేన పార్టీ నేత డాక్టర్ వంపూరు గంగులయ్య





**స్టాఫ్ రిపోర్టర్,పాడేరు/గూడెం కొత్త వీధి,పెన్ పవర్,జూలై 22:**ఐటీడీఏ కార్యాలయంలో మంగళవారం నిర్వహించిన జిఒ నెం 3పై వర్క్‌షాప్‌లో జనసేన పార్టీ పాడేరు నియోజకవర్గ ఇన్‌చార్జ్ డాక్టర్.వంపూరు గంగులయ్య పాల్గొన్నారు.ఈ సందర్భంగా గిరిజన సంక్షేమ శాఖ సంచాలకులు సదా భార్గవి కి స్వయంగా ఒక వినతిపత్రాన్ని అందించారు. ఇందులో గిరిజన నిరుద్యోగ యువతకు ఉద్యోగ భద్రత కల్పించే జీవో నంబర్ 3ను తిరిగి అమలు చేయాలనే విజ్ఞప్తిని స్పష్టంగా తెలిపారు.

డాక్టర్ వంపూరు గంగులయ్య మాట్లాడుతూ, గత ప్రభుత్వం కాలంలో గిరిజన చట్టాలను విస్మరించడం వల్ల ఆదివాసీలలో తీవ్ర అసంతృప్తి నెలకొంది.మెగా డిఎస్సి, పాడేరు మెడికల్ కాలేజీ, గ్రామ సచివాలయ నియామకాల్లో గిరిజన యువతకు న్యాయం జరగలేదన్నారు.జీవో 3 రద్దు గిరిజన సమాజాన్ని తీవ్రంగా ప్రభావితం చేసిందని పేర్కొన్నారు.గిరిజనులకు ఉద్యోగ భద్రత కల్పించేందుకు ప్రత్యేకంగా తీసుకొచ్చిన జీవో నెం 3ను పునరుద్ధరించకపోతే, వెనుకబాటుతనాన్ని నిర్మూలించాలన్న రాజ్యాంగ దిశ కూడా దెబ్బతింటుందని హెచ్చరించారు.దీనిపై ఇప్పటికే ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ఎన్నికల హామీ ఇచ్చిన విషయాన్ని గుర్తు చేశారు. అలాగే గిరిజన సంక్షేమ శాఖ మంత్రి గుమ్మడి సంధ్యారాణి కూడా దీనిపై ప్రత్యామ్నాయాలు పరిశీలిస్తున్నట్టు తెలిపిన విషయాన్ని ఈ సందర్భంగా గుర్తు చేశారు.వినతిపత్రం ద్వారా ప్రభుత్వం తన సామాజిక బాధ్యతను నెరవేర్చాలని, గిరిజన యువతకు ఉద్యోగ భద్రత కల్పించే దిశగా తక్షణ చర్యలు తీసుకోవాలని డాక్టర్ గంగులయ్య విజ్ఞప్తి చేశారు.

# చేయని తప్పునకు శిక్ష అనుభవిస్తున్నా..

**కోర్టులో చెవిరెడ్డి కంటతడి**



**విజయవాడ:పెన్ పవర్,జూలై 22** కోర్టులో మాజీ ఎమ్మెల్యే చెవిరెడ్డి భాస్కర్‌రెడ్డి కంటతడి పెట్టుకున్నారు. జడ్జి ముందు తన వాదనలు వినిపించుకునే క్రమంలో చెవిరెడ్డి భావోద్వేగానికి గురయ్యారు. తన తండ్రి, తన సోదరుడు మద్యం కారణంగానే చనిపోయారని చెవిరెడ్డి ఆవేదన వ్యక్తం చేశారు. అందువల్లే తాను మద్యం జోలికి వెళ్ల లేదు, వెళ్లబోనని భాస్కర్‌రెడ్డి చెప్పారు. చేయని తప్పునకు శిక్ష అనుభవిస్తున్నానని బాధగా ఉందని చెవిరెడ్డి అన్నారు.

వైయస్ఆర్‌సీపీ ప్రభుత్వం పారదర్శకంగా అమలు చేసిన మద్యం విధానంపై రెడ్‌బుక్ కుట్రతో నమోదు చేసిన అక్రమ కేసును వేధింపులకు పాల్పడటమే లక్ష్యంగా కూటమి సర్కార్ పాలన సాగుతోంది. అందుకోసం అబద్ధపు వాంగ్మూలాలులు, తప్పుడు సాక్ష్యాలతో భేతాళ కుట్రకు తెరతీసింది. ఆ కుట్రలో చెవిరెడ్డి భాస్కర్ రెడ్డిని అక్రమంగా అరెస్టు చేసింది. ఈ కేసులో ఆయన్ని ఏ38గా చేర్చింది.

# జీవో నెంబర్ 3 పటిష్టంగా అమలు చేయడానికి కృషి చేయాలి

**ఆంధ్రప్రదేశ్ ఆదివాసి వికాస్ పరిషత్ జిల్లా ప్రధాన కార్యదర్శి పి.చందు**





**స్టాఫ్ రిపోర్టర్,పాడేరు/గూడెం కొత్త వీధి,పెన్ పవర్,జూలై 22:**అల్లూరి సీతారామరాజు జిల్లా పాడేరు లోని ఐటీడీఏ కార్యాలయంలో మంగళవారం జీవో నెంబరు 3 పై అవగాహన సదస్సు, వర్క్ షాప్ నిర్వహించబడింది.ఈ కార్యక్రమానికి గిరిజన సంక్షేమ శాఖ డైరెక్టర్ భార్గవి ఆధ్వర్యంలో నిర్వహించారు. అయితే ఈ వర్క్‌షాప్‌లో ఆంధ్రప్రదేశ్ ఆదివాసి వికాస్ పరిషత్ రాష్ట్ర అధ్యక్షులు అడపా బొంజు నాయుడు ఆదేశాల మేరకు, జిల్లా ప్రధాన కార్యదర్శి పి.చందు,మహిళా విభాగ సభ్యులు, జిల్లా మహిళా అధ్యక్షులు, కార్యకర్తలు మరియు సంఘ సభ్యులు పాల్గొని జీవో నెంబర్ 3 పునరుద్ధరించాలని కోరుతూ వినతి పత్రం సమర్పించారు.ఈ సందర్భంగా పి.చందుమాట్లాడుతూ, జీవో నెంబర్ 3 అనేది గిరిజనులకు 100 శాతం ఉపాధి హామీ కల్పించే కీలక జీవో. ఈ జీవోను మరింత బలంగా అమలు చేయాలనే దృష్టితో మా తరపున ప్రభుత్వానికి వినతులు అందజేస్తున్నాం," అని తెలిపారు. అలాగే జీవోపై వివరాలు మరియు సంబంధిత హార్డ్ కాపీని గిరిజన సంక్షేమ శాఖ సంచాలకులు సదా భార్గవి కి అందజేశామని పేర్కొన్నారు. "100 శాతం గిరిజన స్థానికులకే ఉద్యోగం కల్పించేందుకు జీవో నెం. 3 పునరుద్ధరణకు కృషి చేయాలని, ఆదివాసుల హక్కులను కాపాడేందుకు ప్రభుత్వం కట్టుబడి ఉండాలని కోరారు. జీవో నెంబర్ 3ను రాజ్యాంగబద్ధంగా బలంగా అమలు చేయాలి.100% గిరిజన స్థానికులకే ఉద్యోగాలు, ఉపాధి అవకాశాలు కల్పించాలి.ఈ జీవోను 9వ షెడ్యూల్‌లో చేర్చాలి.ప్రస్తుతం విడుదలైన డిఎస్సీ ప్రకటనను ఏజెన్సీ ప్రాంతాల్లో రద్దు చేసి, జీవో పునరుద్ధరణ అనంతరం మాత్రమే నియామక ప్రక్రియ నిర్వహించాలి కోరారు. సదస్సులో పాల్గొన్న ప్రతినిధులు జీవో నెంబర్ 3 అమలుతో గిరిజనులకు న్యాయం జరిగే మార్గం సుళువవుతుందని ఆశాభావం వ్యక్తం చేశారు.

# పంటల నమూనాలతో ఆర్థిక అభివృద్ధి..

**జిల్లా ప్రకృతి వ్యవసాయ ప్రబంధకులు(డిపిఎం)యం.శ్రావన్ కుమారునాయుడు.**



**గుమ్మలక్ష్మీపురం. జూలై 22.పెన్ పవర్.**మండలంలోని దుడ్డుకల్లు గ్రామంలో రాయగడ జమ్మూ,గొయ్యిపాక,చాపరాయి బిన్నిడి.యూనిట్లకు చెందిన ప్రకృతి వ్యవసాయ కార్యకర్తలతో మండల మోడల్ థి మోటిక్ లీడ్ గణేష్ శరత్ చంద్ర.ఆధ్వర్యం లో ఈ కార్యక్రమం నిర్వహించారు.

ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కార్యకర్తలు ప్రథమంగా తమ యొక్క పూర్తి స్థాయి విస్తీర్ణంలో ప్రకృతి వ్యవసాయ పద్ధతులు పాటించి ఏ.టి.యం,ఏ గ్రేడ్.ఏ గ్రేడ్ ప్లస్,డి.అర్.పి.యం,వరి గట్లు వెడల్పులో ఆకు,కూరగాయలు,పండ్ల మొక్కలు,తీగ జాతులు వేసుకొని ఆర్దికాబివృద్ధి సాధించడం జరుతుందని, కార్యకర్తలుకు సంబంధించిన గ్రామంలోని రైతులకు ఆదర్శవంతంగా ఉండాలని,రైతులచే పంటల నమూనాలు వారి యొక్క ఆర్థికాభివృద్ధి సాధించేలా కృషి చేయవలసిన బాధ్యత మనందరిపై ఉందని ఆయన అన్నారు.గిరిజన ప్రాంతాలలోని నేల వివిధ రకాల పంటలుకు,మరియు పసుపు,అల్లం,ఫైనాపిల్,కర్రపెండ్ల%శీ%,మొదలగు పంటలు వేసుకోవడం వల్ల అదిక దిగుబడులు సాధించడానికి అవకాశం వుందని అన్నరు,మన జిల్లాలో జట్టు సంస్థ సూచనలు,సలహాలు కార్యకర్తలకు శిక్షణ ఇవ్వడం నిజంగా అభినందించదగ్గ విషయమని,అందరూ కూడా సద్వినియోగం చేసుకోవాలని,గత ఏడాది. ఇప్పుడు ఏ,ఏ పంటలు వేశారు,ఎంత ఆదాయం పొందారు,ఇంకా ఎక్కువ ఆదాయం ఎలా పొందాలో వివరించా రు.శ్రీ రాగి,శ్రీ వరి,చిరుధాన్యాలు సాగు విస్తీర్ణం పెంచాలన్నారు,మారుతున్న శాస్త్ర సాంకేతిక పరిజ్ఞానాన్ని వ్యవసాయ ఉత్పత్తులు జోడించి అదిక దిగుబడులు సాధించేలా కార్యకర్తలు కృషి చేయవలసిన అవసరం ఉందన్నారు.పండ్ల తోటలలో అంతర పంటలు వేసుకొని అదనపు ఆదాయం రైతులు పొందడానికి కార్య కర్తలు అందుబాటులో ఉండాలన్నారు,ఈ కార్యక్రమంలో ఏ.డి.ఏ.రెడ్డి అన్నపూర్ణ,జట్టు సంస్థ కొ ఆర్డినేటర్ యం.నూకమ్ నాయుడు.యంగ్ ప్రొఫెషనల్ రవి తేజ,జీవ ప్రాజెక్ట్ కొ ఆర్డినేటర్ జి.ప్రోబోద్ మండలం ఇన్చార్జి యం.సీతారాం తదితరులు పాల్గొన్నారు.

# 87వ వార్డ్ లో క్రీడా ప్రాంగనాన్ని అభివృద్ధి కి ప్రణాళిక

**నిధులు మంజూరు చేసి పనులు పూర్తి అయ్యే విదంగా చూడాలని అధికారులకు వెల్లడి**

**వార్డ్ కార్పొరేటర్ బోండా జగన్ ఆధ్వర్యంలో పనులను పరిశీలించిన మేయర్ పీలా శ్రీనివాసరావు,ఎంఎల్ఏ పల్లా**



**గాజువాక : పెన్ పవర్ ,జూలై22** మహా విశాఖ నగర పాలక సంస్థ 87 వార్డు పరిధిలో సిద్ధార్థ నగర్ కి ఆనుకొని ఉన్న నాలుగు ఎకరాల ముప్పై సెంట్లు స్థలంలో స్పోర్ట్స్ కాంప్లెక్స్ నిర్మాణపు పనులు టీడీపీ రాష్ట్ర కార్యదర్శి వార్డ్ కార్పొరేటర్ బోండా జగన్నాథం ఆధ్వర్యంలో టిడిపి రాష్ట్ర అధ్యక్షుడు , గాజువాక నియోజకవర్గం శాసనసభ్యుడు పల్లా శ్రీనివాస రావు , నగర మేయర్ పీలా శ్రీనివాసరావు పరిశీలించారు . ఈ సందర్భంగా మాట్లాడుతూ స్పోర్ట్స్ కాంప్లెక్స్ నిర్మాణం కొరకు కేటాయించిన నిధులు తక్షణమే విడుదల చేసి పనులు పూర్తి అయ్యే విధంగా చూడాలని నగర్ మేయర్ పీలా శ్రీనివాసరావు , జోనల్ కమిషనర్ శేషాద్రి ని.కోరారు.ఈ కార్యక్రమంలో ఎంఆర్ఎఫ్ అప్పారావు , వార్డ్ అధ్యక్షుడు విజయరామరాజు, వర్రె రాంబాబు, పెంటారావు, భాస్కరరావు, ఆనంద్ కుమార్, పోతల కృష్ణ, కడుపుట్ల శ్రీను, చక్రి, జాన్ రమేష్, సుందర్ సునీల్ , బొడ్డేటి దేవుడు,డి వీ సూరిబాబు, టీఎస్ మూర్తి. దా లయ్య తదితరులు పాల్గొన్నారు

# నందమూరినగర్లో సుపరిపాలనలో తొలి అడుగు కార్యక్రమం





**ముఖ్యఅతిథిగా పాల్గొన్న పశ్చిమ ఎమ్మెల్యే గణబాబు**



**గోపాలపట్నం, పెన్ పవర్, జూలై 22 :** ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు ఆదేశాల మేరకు సుపరిపాలనలో తొలి అడుగు కార్యక్రమంలో భాగంగా 92వ వార్డు వెంకటాపురం, నందమూరినగర్లో సుపరిపాలనలో తొలి అడుగు కార్యక్రమం ఘనంగా నిర్వహించబడింది. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా ప్రభుత్వ విప్, పశ్చిమ నియోజకవర్గం ఎమ్మెల్యే గణబాబు పాల్గొన్నారు. ఈ సందర్భంగా గణబాబు ప్రతి ఇంటిని సందర్శించి, సంవత్సరంలో ప్రభుత్వం అందించిన అభివృద్ధి కార్యక్రమాలు మరియు సంక్షేమ ఫలితాలను ప్రజలకు వివరించారు. అడుగడుగునా ప్రజలు ఎమ్మెల్యే గణబాబుకి ఘనస్వాగతం పలుకుతూ మహిళలు హారతులిచ్చి ఆశీర్వదించారు. స్థానిక వార్డు సమస్యలను తెలుసుకుంటూ పరిష్కారానికి చర్యలు చేపట్టారు. ఈ కార్యక్రమంలో 92వ వార్డు ఇంచార్జ దాడి రమేష్ నాయుడు, వార్డ్ ప్రెసిడెంట్ కంపర ఆనంద్, కూటమి నాయకులు పొరమరశెట్టి సీతారాం, బాలసుబ్రహ్మణ్యం, నందవరపు సోములు, మూర్తి పట్నాయక్, నారిపిన్ని సత్తిరాజు, బొడ్డేటి విజయ్, లత, శరగడం అరుణ్ కుమార్, దాడి సురేష్, గవ్వ భాస్కర్, కంపర శ్రీను, వర్మ, తతబాబు, తేజ, సతీష్, సూర్యకళ, శంకర్, వీరరాజు, మంగలక్ష్మి, సోమేశ్, సునీల్, సిరుమూల గౌరీ మరియు మహిళా నాయకులు, అధిక సంఖ్యలో ప్రజలు, కార్యకర్తలు పాల్గొన్నారు.

# ప్రజల్లో అసమానత్వాన్ని తొలగించడమే పి4యొక్క ప్రధాన లక్ష్యం

- జనసేన పార్టీ నేత గొర్లె వీర వెంకట్



**గూడెం కొత్త వీధి పెన్ పవర్ జూలై 22:** అల్లూరి సీతారామరాజు జిల్లా గూడెం కొత్త వీధి మండల కేంద్రంలో గల సచివాలయంలో స్థానిక సర్పంచ్ కొర్ర సుభద్ర అధ్యక్షతన పి4 గ్రామసభ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో స్థానిక ఎంపీటీసీ రిమెల రాజేశ్వరి, ఇతర కూటమి నేతలు పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న జనసేన పార్టీ అరకు పార్లమెంట్ ఎగ్జిక్యూటివ్ మెంబెర్ గొర్లె వీర వెంకట్ మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం ఆశయాల మేరకు పి4 కార్యక్రమం ద్వారా బంగారు కుటుంబాలను దత్తత తీసుకొని పేదరికం లేని సమాజ నిర్మాణమే ఈ కార్యక్రమం యొక్క ముఖ్య ఉద్దేశమని అన్నారు. పేదలను గుర్తించి వారికి ఆర్థికంగా విద్యా వైద్య రంగాల్లో సమగ్ర సహాయం అందించాలన్నారు. పేద విద్యార్థులను దత్తత తీసుకొని వారిని చదివించడానికి కృషి చేయాలని అన్నారు. పేదలను సహాయం చేయటానికి మార్గదర్శకాలను గుర్తించి సంఘీభావంతో ముందుకు సాగాలన్నారు. పేదరిక నిర్మూలనకు ప్రతి ఒక్కరూ ముందుకు రావాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి, సచివాలయం సిబ్బంది, వార్డు సభ్యులు పేసా కమిటీ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

# కస్తూరిబా పాఠశాలనుఆకస్మిక తనిఖీ చేసిన ఆర్డీఓ కే సందీప్ మాధవ్





**పద్మనాభం, పెన్ పవర్, జులై 22 :** మండల కేంద్రంలో కస్తూర్బా గాంధీ బాలికల పాఠశాలను మంగవారం ఆర్డీవో కే సందీప్ మాధుర్ ఆకస్మికంగా తనిఖీ చేశారు. కే సందీప్ మాట్లాడుతూ కస్తూర్బా బాలికల పాఠశాలలో పరిసరాలను పరిశీలించి పరిశు భ్రంగా ఉంచు కోవాలన్నారు. కస్తూర్బా గాంధీ బాలికల పాఠశాలలో వంట వంటగదిని స్టోర్ రూమ్ ని కూరగాయలను బియ్యాన్ని పప్పులు వంట సరుకులను పరిశీలించి అనంతరం విద్యార్థి నులతో మాట్లాడి ఇప్పుడు భోజనం ఎలా ఉంటుంది పోషకాలతో కూడిన నాణ్యమైన భోజనం సమయానికి పెడుతున్నారా లేదా అని విద్యార్థులను అడిగి తెలుసుకున్నారు. విద్యార్థులకు పోషకాలతో కూడిన బలవర్ధక నాణ్యమైన భోజనం పోషకాహారంతో పాటు విద్యను అభ్యర్థించాలన్నదే రాష్ట్ర ప్రభుత్వ ఉద్దేశమన్నారు. రాష్ట్ర ప్రభుత్వ సంకల్పానికి అనుగుణంగా విద్యార్థులు మంచిగా చదువు కొని ఉత్తమ ఫలితాలు సాధించాలని తల్లిదం డ్రులకు కుటుంబ సభ్యులకు దూరంగా ఉన్నామని భావనను దరి చేరనివ్వకుండా మంచిగా చదువుకుని జీవితంలో కన్నవారి కలలు నిజం చేయాలని కష్టపడి కాకుండా ఇష్టపడి చక్కగా చదువుకుని ఉత్తమ ఫలితాలు సాధించాలని విద్యార్థులకు సూచించారు. కస్తూ ర్బా గాంధీ బాలికల పాఠశాలలో చదువుతున్న విద్యార్థులకు విద్యతోపాటు ప్రభుత్వ నిర్దేశిం చిన విధంగా మెనూ ప్రకారం ఉదయం టీ. టిఫిన్ మధ్యాహ్నం నాణ్యమైన భోజనం పౌష్టికాహారం విద్యార్థులకు సమయానికి అందించాలని వంట విషయంలో ఎలాంటి పొరపాట్లు చేయకూడదని కస్తూర్బా గాంధీ పాఠశాల సిబ్బందికి సూచించారు.

# జీవో నెం.3 పునరుద్ధరణపై పట్టుదల - గిరిజనులకు పూర్తి రిజర్వేషన్ ఉండాల్సిందే:

ఎమ్మెల్యే మత్స్యరాస విశ్వేశ్వర రాజు



**స్టాఫ్ రిపోర్టర్, పాడేరు గూడెం కొత్త వీధి,పెన్ పవర్,జూలై 22:** పాడేరు ఐటీడీఏలో గిరిజన సంక్షేమ శాఖ సంచాలకులు సదా భార్గవి ఆధ్వర్యంలో జీవో నెం.3 మరియు గిరిజన చట్టాలపై జరుగుతున్న ప్రజాభిప్రాయ సేకరణ వర్క్‌షాప్ సమావేశంలో గిరిజన సంక్షేమ శాఖ సంచాలకులు సదా భార్గవికి వినతి పత్రాన్ని అందజేశారు వైఎస్సార్సీపీ శాసనసభ్యులు, జిల్లా అధ్యక్షులు మత్స్యరాస విశ్వేశ్వర రాజు, అరకు ఎమ్మెల్యే రేగం మత్యలింగం, ఎమ్మెల్సీ కుంభా రవిబాబు, జిల్లా పరిషత్ చైర్‌పర్సన్ జల్లిపల్లి సుభద్ర, రాష్ట్ర ఎస్టీ సెల్ అధ్యక్షురాలు కొట్టగుల్లి భాగ్యలక్ష్మి తదితర ప్రజాప్రతినిధులు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలోఎమ్మెల్యే మత్స్యరాస విశ్వేశ్వర రాజు మాట్లాడుతూ జీవో నెం. 3ను సుప్రీంకోర్టు రద్దు చేసిన తర్వాత, అప్పటి ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్ రెడ్డి ఆదేశాల మేరకు రిట్ పిటిషన్ దాఖలు చేసినా, దానిని సుప్రీంకోర్టు తిరస్కరించింది. ఇప్పుడు కూటమి ప్రభుత్వం వర్క్‌షాప్‌ల పేరిట కాలయాపన చేస్తోంది. ఎన్నికల ముందు అరకు వేదికగా గిరిజనులకు సమానమైన జీవో తీసుకొస్తామని చెప్పిన ప్రస్తుత ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు, ఇప్పుడు ఆ మాటను మరిచారు. గిరిజనులకు 100% రిజర్వేషన్ ఉండాల్సిందే. దాన్ని తగ్గించే ప్రయత్నం చేసినా వైఎస్సార్సీపీ తరఫున గట్టి పోరాటం చేస్తాం."అన్నారు. వైఎస్సార్సీపీ ప్రజాప్రతినిధులు జీవో నెం.3 పునరుద్ధరణ కోసం ప్రభుత్వం ముందు వినతులు పెడుతూ, గిరిజనుల హక్కుల కోసం తమ పోరాటాన్ని కొనసాగిస్తామని స్పష్టం చేశారు.

# పవన్ కళ్యాణ్ కోసం దివ్యాంగుడు ఎదురు చూపులు








- పవన్ కళ్యాణ్ ను కలవాలని ఉంది,బాధలు చెప్పుకోవాలని పవన్ కళ్యాణ్ వీర అభిమాని
- దివ్యాంగుడు ఆవేదన
- సాయం కోసం ఆక్రందన

**గాజువాక : పెన్ పవర్ ,జూలై 22** పారిశ్రామిక ప్రాంతం లో నివాసం ఉంటున్న దివ్యంగుడు తన ఆవేదనను పత్రికకా ముఖం గా తెలియజేశాడు . విశాఖ జిల్లా గాజువాక నియోజకవర్గం వడ్లపూడి గ్రామం ఎన్టీఆర్ కాలనీలో నివాసం ఉంటున్న అప్పలరాజు ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ వీర అభిమాని నని నేను ఒక దివ్యాంగుడిని ఈ దివ్యాంగత్వంతో పాటు నాకు గుండెలో రిట్రో పలమనరి సింద్రోమ్ అనే వ్యాధి తో బాధ పడుతున్నాడని

వైద్యులు ధ్రువీకరించి తెలిపారని . ఈ సమస్య వలన తన శరీరంలో రక్త శాతం పెరుగుతున్న సమయంలో అది నోటి ద్వారా బయటకు వచ్చేస్తుందని ఆ సమయంలో శారీరకంగా అనేక ఇబ్బందులు పడుతున్నానని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ సమస్యపై చాలా ఆసుపత్రుల్లో చాలామంది వైద్యులుకు సంప్రదించినప్పుడు దీనికి అయితే ఎటువంటి శస్త్ర చికిత్స లేదని ఊపిరి ఉన్నంత తవరకు ఇలాగే జీవించాలని చెప్పారని వాపోయాడు . అయినా నేను గుండె ధైర్యంతో ఇంతవరకు జీవనం సాగిస్తున్నానని, ఇకపై పరిస్థితులు ఏ విధంగా ఉంటాయో ఆ దేవుడి మీద భారం వేసి జీవనం సాగిస్తున్నానని చెప్పేరు. దీంతోపాటు నా ఆర్థిక పరిస్థితి మరింత క్షీణిస్తూ వస్తుందని, బతకాలని ఆశ కలుగుతుందని కానీ నిలబడగలనో లేదో అని అపనమ్మకంగా ఉంది అంటూ పై సమస్యలపై ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ కు విన్నపం చేస్తున్నానని, ఏదైనా ఉద్యోగం కోసం ప్రయత్నించిన నా ఆరోగ్య పరిస్థితి చూసి ఎవ్వరు ముందుకు రావడం లేదని, ఇటువంటి సందర్భాలు చాలా ఉన్నాయని అన్నారు. కాబట్టి తగిన సహాయాన్ని అందించి, మరికొద్ది రోజులు ఇంకా జీవించడానికి అవకాశం కల్పిస్తారని ఆశిస్తూ, నాది ఒక చిన్న కోరిక అంటూ నేను పవన్ కళ్యాణ్ కి వీరాభిమానిని ఆయన కలవాలని చాలా ప్రయత్నాలు చేశాను కానీ అవి కూడా ఫలించలేదని కానీ పవన్ కళ్యాణ్ ను కలిసి మాట్లాడి నా గుండె ధైర్యాన్ని పెంచుకోవడానికి అవకాశం కల్పిస్తారని నేను చాలా ప్రయత్నాలు చేశానని అందులోని మొదటిగా గత సంవత్సరం 12 జూలై 2024న తెలంగాణ నుండి మా స్నేహితుల ద్వారా జనసేన పార్టీ కార్యాలయం మంగళగిరి ఒక వినతి పత్రాన్ని పంపించడం జరిగిందని, దానికి సమాధానం గా ఒక వారం పది రోజుల్లోనే జనసేన కార్యాలయం నుంచి మాకు ఫోన్ వచ్చింది తొందర్లోనే పవన్ కళ్యాణ్ ని కలిసే ఏర్పాటు చేస్తామని చెప్పారని కానీ అనంతరం అక్కడి నుంచి నాకు ఎలాంటి సమాచారము తనకు ఇవ్వలేదని, నేను ఒక నాలుగు ఐదు సార్లు కార్యాలయానికి కి ఫోన్ ద్వారా సంప్రదించిన స్పందన అంతంత మాత్రం గానే ఉండేదని, సంవత్సరం రోజులు గడిచిన తర్వాత జనసేన పార్టీ మంగళగిరి కార్యాలయానికి వెళ్లడం జరిగిందని, అక్కడ పరిస్థితులు చూసి మళ్లీ వెను తిరిగి వచ్చేసామని, ఇందులో భాగంగానే యూట్యూబ్ లోనే ,ట్విటర్, ఇంస్టాగ్రామ్ లోని నా స్నేహితులు వీడియో రికార్డింగ్ చేసి పోస్ట్ చేయడం జరిగిందని, ఈ వీడియోలను చాలామంది చూశారని లైక్ చేశారని అని ,ఇంతవరకు నా పవన్ కళ్యాణ్ అన్న దగ్గర నుంచి ఫోన్ రాలేదని, ఇలా చాలా ప్రయత్నాలు చేసిన తర్వాత మరి వేరే దారి లేక మీడియా ప్రతినిధులు వాళ్ళని సంప్రదించడం జరిగిందని ,అయినా కూడా ఎటువంటి సమాచారం తనకు అందలేదని ,ఇకనైనా కూటమి ప్రభుత్వం నా ఆవేదన ను అర్థం చేసుకొని తన దైవం పవన్ కళ్యాణ్ కలిసే భాగ్యన్ని కనిపించి తను బతికేందుకు భరోసా కల్పించాలని పత్రికా సముఖంగా విజ్ఞప్తి చేసుకుంటున్నా అని తెలిపారు .

# ప్రణాళికా బద్ధంగా జిఓ నెం 3 పునరుద్ధరణకు కృషి





**ఆదివాసీల సంక్షేమం అభివృద్దే లక్ష్యం**

**గిరిజన సంక్షేమశాఖ సంచాలకులు సదా భార్గవి**

**స్టాఫ్ రిపోర్టర్,పాడేరు/గూడెం కొత్త వీధి, పెన్ పవర్,జూలై 22:** గిరిజన సంక్షేమానికి అభివృద్ధికి సంజీవినీ లాంటి జి. ఓ. 3 పునర్దురణకు ప్రణాళికా బద్ధంగా కృషి చేస్తున్నామని గిరిజన సంక్షేమశాఖ సంచాలకులు సదా భార్గవి స్పష్టం చేసారు. మంగళవారం ఐటిడిఏ సమావేశ మందిరంలో జి.ఓ నెం.3 పునరుద్దరణ, గిరిజన చట్టాలు అమలుపై గిరిజన ఉపాధ్యాయ సంఘాలు, గిరిజన నాయకులు, గిరిజన సంఘాలతో అభిప్రాయ సేకరణ సమావేశంలో మాట్లాడారు. రాష్ట్ర ప్రభుత్వం ఆదేశాల మేరకు గిరిజన ప్రాంతాల్లో నూరు శాతం ఉద్యోగాలు గిరిజనులకే రిజర్వేషన్ వర్తించేలా చర్యలు చేపట్టామన్నారు. జిఓ నెం 3 పునరుద్దరణకు రంపచోడవరం,పార్వతీపురం ఐటిడిఏలలో ప్రజాభిప్రాయ సేకరణ చేసామన్నారు. నిర్దేశించిన ప్రొఫార్మాలో అభిప్రాయ సేకరణ చేస్తున్నామని చెప్పారు. వీటన్నిటిని క్రోడీకరించి ప్రభుత్వానికి ప్రతిపాదిస్తామన్నారు. జి.ఓ నెంబరు 3 వలన 4 వేల పై చిలుకు ఉద్యోగాలు గిరిజనులు పొందారని అన్నారు. జి.ఓ నెం 3 చచ్చిపోయిందని తిరిగి బతికిస్తారా అంటూ ప్రశ్నిస్తున్నారని అన్నారు. లక్షణుడుకు సంజీవినీలా అన్ని ప్రయత్నాలు చేసి పునరుద్దరణ కృషి చేస్తున్నామని పేర్కొన్నారు. ఆదివాసీల అభివృద్ధి సంక్షేమమే లక్ష్యం అన్నారు ఐటిడిఏ ఇంచార్జి పిఓ జెసి డాక్టర్ ఎం.జె. అభిషేక్ గౌడ మాట్లాడుతూ జి.ఓ నెం.3 ని వాపసు తీసుకుని రావాలని ప్రభుత్వం, గిరిజన సంక్షేమ

దృష్టికి తీసుకుని వెళ్లడం జరిగిందన్నారు. వర్కుషాపును విజయవంతంగా నిర్వహించడానికి అందరూ సహకారం అందించాలని కోరారు. 1986 లో జి. ఓనెం. 279 ను గిరిజనులకు పూర్తి స్థాయిలో రిజర్వేషన్లు కల్పిస్తూ ప్రభుత్వ జి.ఓ జారీ చేసిందన్నారు. న్యాయవాది పల్లా త్రినాధరావు మాట్లాడుతూ జి.ఓ నెం 3 రద్దు, జి. ఓనెం .275, 73, 375, 1/70 చట్టాల గురించి వివరించారు. గిరిజన చట్టాలు అమలు, హక్కులపై పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా వివరించారు. ఎంఎల్సి కుంభా రవిబాబు, జిల్లా పరిషత్ చైర్ పర్సన్ జల్లిపల్లి సుభధ్ర, గిరిజన సంఘాల నేతలు అప్పల నరస, ముకి శేషాద్రి, కిల్లో సురేంద్ర తదితరులు మాట్లాడారు. ఈ సమావేశంలో పాడేరు ఎంఎల్ఏ మత్స్యరాస విశ్వేశ్వర రాజా, అరకు ఎంఎల్ఏ రేగం మత్స్యలింగం,కూటమి నేతలు గిడ్డి ఈశ్వరి, పంపూరి గంగులియ్య,దొన్ను దొర, మత్స్యరాస మణికుమారి, కూడా కృష్ణారావు, అఖిల భారత గిరిజన ఉద్యోగుల సంఘం, అంధ్ర ప్రదేశ్ ఆదివాసీ జెఎసి, గిరిజన విద్యార్థి సంఘాలు, గిరిజన సంక్షేమ ఉపాధ్యా సంఘం, ఆల్ ఇండియా ఆదివాసీ ఎంప్లాయిస్ ఫెడరేషన్, ఆదివాసీ సంక్షేమ పరిషత్ సంఘాల ప్రతినిధులు, ఐటిడి ఏ సహాయ ప్రాజెక్టు అధికారి ఎం. వేంకటేశ్వరరావు, పరిపాలనాధికారి ఎం. హేమలత, వివిద సంఘాల నాయకులు తదితరులు పాల్గొన్నారు.






# బంగారు కుటుంబాల మ్యాపింగ్ మరియు ఆన్లైన్ రిజి స్ట్రేషన్

- ఆగస్టు 15 నాటికి 73% లక్ష్యం సాధించే దిశగా ప్రణాళికలు సిద్ధం
- జాయింట్ కలెక్టర్ మయూర్ అశోక్





**స్టాఫ్ రిపోర్టర్, పెన్ పవర్, విశాఖపట్నం, జూలై 22.** :స్వర్ణాంధ్ర జీరో పోవర్టి - పి 4 (పబ్లిక్ ప్రైవేట్ పీపుల్స్ పార్ట్నర్ షిప్) లో భాగంగా మార్గదర్శ కు బంగారు కుటుంబాల మ్యాపింగ్ పై మంగళ వారం మధ్యాహ్నం జిల్లా కలెక్టరేట్ సమావేశ మందిరంలో జాయింట్ కలెక్టర్ మయూర్ అశోక్ జిల్లా అధికారులతో సమీక్షా సమావేశం నిర్వ హించారు. ఈ సందర్భంగా జాయింట్ కలెక్టర్ మాట్లాడుతూ బంగారు కుటుంబాలను మ్యా పింగ్ చేయడానికి అవసరమైన మార్గదర్శులను ఎంపిక త్వరితగతిన పూర్తి చేయాలని అధికా రులను ఆదేశించారు. ఇప్పటివరకు ఎంపిక చేయబడిన 2600 మార్గధర్శుల ఒక్కొక్కరికి 10 బంగారు కుటుంబాలు చొప్పున 26 వేల బంగారు కుటుంబాల మ్యాపింగ్ 2 రోజుల్లో పూర్తికావాలని ఆదేశించారు. ఆగస్టు 15 నాటికి 73% లక్ష్యం సాధించే దిశగా ప్రణాళికలు సిద్ధం చేయాలని సూచించారు. శాఖల వారీగా నిర్దేశిం చిన లక్ష్యాలను సాధించే దిశగా అందరూ కృషి చేయాలని అన్నారు. సమావేశంలో మొదటగా జిల్లా ప్రణాళికా అధికారి శ్రీనివాసరావు బంగారు కుటుంబాల మ్యాపింగ్ మరియు ఆన్లైన్ రిజి స్ట్రేషన్ పై జిల్లా అధికారులకు వివరించారు.
ఈ కార్యక్రమంలో హౌసింగ్ ప్రాజెక్ట్ డైరెక్టర్ సత్తిబాబు, జిల్లా పౌర సరఫరాల అధికారి భాస్కరరావు, జిల్లా మత్స్యశాఖ అధికారి లక్ష్మణరావు, కలెక్టరేట్ పరిపాలన అధికారి ఈశ్వరరావు మరియు ఇతర జిల్లా అధికారులు పాల్గొన్నారు

# ప్రజా సంక్షేమ పథకాల అమలు పై అధికారులు సిబ్బందితో సమీక్ష

ఎంపీడీవో ఉమామహేశ్వరరావు





**గూడెం కొత్త వీధి పెన్ పవర్ జులై 22:**అల్లూరి సీతారామరాజు జిల్లాలోని గూడెం కొత్త వీధి మండలంలో ఉన్న వివిధ పంచాయతీ సచివాలయాలలో విధులు నిర్వహిస్తున్న అధికారులు సిబ్బందితో గూడెం కొత్తవీధి మండల అభివృద్ధి అధికారి ఉమామహేశ్వరరావు ప్రభుత్వ పథకాల అమలు తీరుపై సమీక్ష సమావేశాన్ని నిర్వహించారు. మండలంలోని వివిధ సచివాలయ ఉద్యోగులు వారు చేపట్టాల్సిన కార్యక్రమాల వివరాలను తెలియజేశారు మండలంలో ఇప్పటికే అనేక కార్యక్రమాలు అమలు జరుగుతున్నాయని వాటిని పూర్తిస్థాయిలో అమలు జరిగే విధంగా సిబ్బంది చర్యలు తీసుకోవాలని ఎంపీడీవో ఉమామహేశ్వరరావు కోరారు వివిధ స్థాయిల్లో ఉన్న ఉద్యోగులు వారికి కేటాయించిన పనులను వెంటవెంటనే అమలు జరిగే విధంగా చూడాల్సిన బాధ్యత వారిపై ఉందని మండలానికి కొత్తగా వచ్చిన ఉద్యోగులు తమ బాధ్యతలను తెలుసుకొని పనులు చేయాలని ఆయన కోరారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ ఎంపీడీవో మహేష్, ఆర్డబ్ల్యూఎస్ ఏఈ కళ్యాణ్,ఏఈ హౌసింగ్ సెగ్గే సూరిబాబు తదితరులు పాల్గొన్నారు.

# ముదురుతున్న పెద్దన్న మాటలు... భారత్ పై అమెరికా వివాదాస్పద హెచ్చరికలు!



**హైదరాబాద్ పెన్ పవర్:** ప్రపంచానికి పెద్దన్నగా పిలవబడే అమెరికా వైఖరి.. ట్రంప్ రెండోసారి ప్రెసిడెంట్ అయిన తర్వాత మరింత శృతిమించితుందనే కామెంట్లు వినిపిస్తున్నాయి. ప్రపంచానికి ఇప్పుడు చక్రవర్తి అవసరం లేదనే చురకలు ట్రంప్ కు పడుతున్నా.. ఆయన వ్యవహార శైలి నియంతలను మరిపిస్తుందనే కామెంట్లు ఇటీవల వినిపిస్తున్నాయి. ఈ సమయంలో... భారత్ పై అమెరికా కాంగ్రెస్ సభ్యుడు చేసిన వ్యాఖ్యలు తీవ్ర వివాదాస్పదంగా మారుతున్నాయి.

అవును... ఉక్రెయిన్ పై యుద్ధం చేస్తున్న రష్యాను ఆర్థికంగా దెబ్బకొట్టేందుకు అమెరికా ప్రయత్నాలు ముమ్మరం చేస్తోంది. అది పూర్తిగా ఆ దేశం వ్యక్తిగత విషయం కావొచ్చు.. ఉక్రెయిన్ తో వారికున్న స్నేహం కావొచ్చు.. లేదా, పుతిన్ పై వారికున్న కడుపుమంట కావొచ్చు. కారణం ఏదైనా అది అమెరికా ఇష్టం. ఈ సమయంలో వారి ఇష్టం నెరవేర్చుకోవడం కోసం భారత్ వంటి దేశంపైనా అమెరికా ఘాటైన హెచ్చరికలు జారీ చేస్తుంది. ఈ సందర్భంగా... అమెరికా కాంగ్రెస్ సభ్యుడు లిండ్సే గ్రాహం స్పందిస్తూ... భారత్, చైనాతో పాటు ఇతర దేశాలకు హెచ్చరికలు జారీ చేశారు. ఇందులో భాగంగా.. ధర తక్కువగా ఉందని రష్యా వద్ద క్రూడాయిల్ ను కొనుగోలు చేయాలని చూస్తే.. మీ ఆర్థిక వ్యవస్థను నిట్ట నిలువునా కూల్చేస్తామని వార్నింగ్ ఇచ్చారు. అలాంటి దేశాలపై ట్రంప్ పరిపాలన చమురు సంబంధిత దిగుమతులపై 100 శాతం సుంకాలను విధించాలని యోచిస్తున్నట్లు చెప్పారు.

ఇదే క్రమంలో... భారత్, చైనాతో సహా రష్యాతో వాణిజ్యం కొనసాగిస్తున్న దేశాల వస్తువులపై 500 శాతం సుంకాలను విధించాలని కోరుతూ గ్రాహం గతంలో ఒక బిల్లును ప్రతిపాదించారు. ఈ నేపథ్యంలో స్పందిస్తూ... ఉక్రెయిన్ తో యుద్ధం కొనసాగేలా రష్యా నుంచి చౌకగా చమురు కొనుగోలు చేస్తే.. భారత్, చైనా, బ్రెజిల్ లను కూల్చేస్తామని.. ఆయా దేశాల ఆర్థిక వ్యవస్థలను అణిచివేస్తామని హెచ్చరించారు.

కాగా, ఉక్రెయిన్ పై యుద్ధం చేస్తున్న రష్యా తీరును అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ తప్పుబడుతూ వస్తున్న సంగతి తెలిసిందే. ఈ క్రమంలో యుద్ధాన్ని ఆపేలా చర్చలకు రావాలని ట్రంప్.. రష్యా అధ్యక్షుడు వ్లాదిమిర్ పుతిన్ ను ఆదేశించారు. అయితే.. ఈ బెదిరింపుల్ని రష్యా ఖండించింది. అమెరికా తమపై ఎలాంటి ఆంక్షలు విధించినా ఎదుర్కొనేందుకు సిద్ధంగా ఉన్నామని స్పష్టం చేసింది. ఈ నేపథ్యంలో రష్యా నుంచి చమురు కొనుగోలు చేస్తున్న భారత్, చైనా, బ్రెజిల్ వంటి దేశాలపై బెదిరింపులకు దిగుతుంది అమెరికా! దీనిపై విదేశాంగ మంత్రి ఎస్ జైశంకర్ స్పందిస్తూ... ప్రతిపాదిత చట్టంపై భారత అధికారులు ఇప్పటికే సెనేటర్ గ్రాహంతో సంప్రదింపులు జరిపారని అన్నారు.

# బిగ్ బ్రేకింగ్... అనంతబాబు డ్రైవర్ హత్య కేసులో కీలక పరిణామం!



**హైదరాబాద్ పెన్ పవర్:** గత ప్రభుత్వ హయాంలో తీవ్ర సంచలనం సృష్టించిన వ్యవహారాల్లో వైసీపీ నేత అనంతబాబు డ్రైవర్ సుబ్రహ్మణ్యం హత్యకేసు ఒకటనే సంగతి తెలిసిందే. అప్పట్లో మృతదేహాన్ని డోర్ డెలివరీ చేశారనే వ్యవహారం తీవ్ర సంచలనంగా మారింది. హత్య తానే చేశానని అనంతబాబు అంగీకరించారని పోలీసులు తెలిపారు! ఈ నేపథ్యంలో ఈ కేసులో తాజాగా కీలక పరిణామం చోటు చేసుకుంది.

అవును... వైసీపీ నేత అనంతబాబు డ్రైవర్ సుబ్రహ్మణ్యం హత్యకేసులో తాజాగా కీలక పరిణామం చోటు చేసుకుంది. ఇందులో భాగంగా... ఈ కేసు తదుపరి విచారణకు రాజమండ్రిలోని ఎస్సీ, ఎస్టీ కోర్టు అనుమతి ఇచ్చింది. ఈ సందర్భంగా... 90 రోజుల్లో సప్లిమెంటరీ ఛార్జ్ షీట్ దాఖలు చేయాలని అధికారులకు న్యాయస్థానం ఆదేశాలు జారీ చేసింది. కాగా... మే 19 - 2022న ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా కాకినాడలో డ్రైవర్ సుబ్రహ్మణ్యం హత్య జరిగిన సంగతి తెలిసిందే! డ్రైవర్ ను హతమార్చిన వైసీపీ నేత అనంతబాబు.. డెడ్ బాడీని డోర్ డెలివరీ చేశారనే ఈ ఘటన అప్పట్లో తీవ్ర సంచలనం రేపింది. నాడు ఈ విషయంపై స్పందించిన అప్పటి ఎస్పీ రవీంద్రనాథ్ బాబు... నేరాన్ని అనంతబాబు అంగీకరించారని తెలిపారు! ఆ సమయంలో... అనంతబాబును రాజమండ్రి సెంట్రల్ జైలుకు రిమాండ్ నిమిత్తం తరలించారు. తర్వాత మధ్యంతర బెయిల్ పై విడుదలయ్యారు. మరోవైపు... తమకు న్యాయం చేయాలని.. అనంతబాబుపై చర్యలు తీసుకోవాలని బాధిత కుటుంబం కోరింది. ఈ నేపథ్యంలో... ఈ కేసు సమగ్ర దర్యాప్తునకు అనుమతి కోరుతూ ఇటీవల సిట్ కోర్టును కోరగా.. ఈ మేరకు అనుమతి లభించింది.

కాగా... డ్రైవర్ సుబ్రహ్మణ్యం భార్య అపర్ణకు 2023లో వైసీపీ ప్రభుత్వం.. వైద్య, ఆరోగ్యశాఖలో జూనియర్ అసిస్టెంట్ గా ఉద్యోగం ఇచ్చిన సంగతి తెలిసిందే. ఇక తాజాగా కూటమి ప్రభుత్వ కొలువుదీరిన తర్వాత.. సుబ్రహ్మణ్యం సోదరుడు వీధి నవీన్ కు డాక్టర్ బీఆర్ అంబేద్కర్ కోనసీమ జిల్లాలోని ద్వారపూడిలోని ఎస్సీ సంక్షేమ హాస్టల్ లో ఔట్ సోర్సింగ్ కింద ఉద్యోగ అవకాశం కల్పించింది.

# అమెరికా పౌరసత్వానికి రహస్య మార్గాలు!




**హైదరాబాద్ పెన్ పవర్:** అమెరికా పౌరసత్వాన్ని పొందడం, ముఖ్యంగా అక్రమంగా దేశంలోకి ప్రవేశించిన వారికి ఇది ఒక అసాధ్యమైన లక్ష్యంగా అనిపించవచ్చు. అయితే ఆశ్చర్యకరంగా, కొంతమంది అక్రమ వలసదారులు కూడా పౌరసత్వాన్ని పొందడంలో విజయవంతమవుతున్నారు. కొందరు చట్టబద్ధమైన మార్గాలను అనుసరిస్తే మరికొందరు వ్యవస్థలో ఉన్న "గ్రే ఏరియాల" ద్వారా తమ మార్గాన్ని సుగమం చేసుకుంటున్నారు.

**పౌరసత్వానికి కొన్ని సాధారణ మార్గాలు**

అక్రమంగా దేశంలో ఉన్నప్పటికీ, కొన్ని సందర్భాల్లో చట్టబద్ధమైన మార్గాల ద్వారా పౌరసత్వం పొందే అవకాశాలు ఉన్నాయి. అమెరికా పౌరుడిని వివాహం చేసుకోవడం పౌరసత్వం పొందడానికి ఒక సాధారణ మార్గం. ఈ వివాహ బంధం నిజమైనదని ప్రభుత్వం నమ్మితే, అక్రమంగా దేశంలోకి ప్రవేశించిన వారి గతాన్ని కొంతవరకు విస్మరిస్తారు. ఈ ప్రక్రియలో నిజమైన సంబంధాన్ని నిరూపించగలగడం చాలా కీలకం. నకిలీ వివాహాలు తీవ్రమైన పరిణామాలకు దారితీస్తాయి. తమ స్వదేశానికి తిరిగి వెళ్లడంపై తీవ్రమైన భయం ఉన్నవారు ఆశ్రయం కోరుకోవచ్చు. వారి దరఖాస్తును ప్రభుత్వం ఆమోదిస్తే, వారికి రక్షణ హోదా లభిస్తుంది. కాలక్రమేణా ఇది గ్రీన్‌కార్డ్, ఆపై పౌరసత్వానికి దారితీస్తుంది. కొన్ని నేరాలకు బాధితులుగా మారి పోలీసు విభాగానికి సహకరించిన వారికి యూ వీసా ద్వారా అవకాశం కలుగుతుంది. ఇది గ్రీన్‌కార్డ్‌కు మార్గం వేస్తుంది, అయితే ఈ ప్రక్రియకు చాలా కాలం వేచి ఉండాల్సి రావచ్చు. సాధారణంగా విదేశీయుల కోసం ఉద్దేశించినప్పటికీ, స్టూడెంట్ లేదా టూరిస్ట్ వీసాలపై వచ్చి, వీసా గడువు ముగియకముందే దరఖాస్తు చేసుకున్నవారు తమ అదృష్టాన్ని పరీక్షించుకోవచ్చు. కొందరికి ఇది గ్రీన్‌కార్డ్‌కు దారితీస్తుంది. డాకా , టీపీఎస్ ఈ కార్యక్రమాలు వలసదారులను తాత్కాలికంగా రక్షిస్తూ, భవిష్యత్తులో చట్టపరమైన మార్గాలకు అవకాశం కల్పించేలా ఉంటాయి.

**ప్రమాదకరమైన, అనధికారిక మార్గాలు**

కొంతమంది అక్రమ మార్గాలను అనుసరించడానికి ప్రయత్నిస్తారు, ఇవి తీవ్రమైన పరిణామాలకు దారితీస్తాయి. చాలా మంది నకిలీ పత్రాలు లేదా నకిలీ వివాహాల ద్వారా అమెరికాలో ఉండడానికి ప్రయత్నిస్తారు. అయితే, ఇవి అతి ప్రమాదకరమైన మార్గాలు. ఒకసారి పట్టుబడితే జీవితకాల నిషేధాన్ని ఎదుర్కొనాల్సి వస్తుంది. కొంతమంది అమెరికా వెలుపల పెళ్లి చేసుకుని, అక్కడి నుంచే గ్రీన్‌కార్డ్‌కు దరఖాస్తు చేస్తారు. అయితే, వారు ఆరు నెలలకు పైగా అక్రమంగా ఉన్నట్లయితే, వారికి 3 నుంచి 10 సంవత్సరాల నిషేధం ఎదురవుతుంది. అయితే ప్రత్యేకమైన మాఫీ ఉంటే తప్ప.

**వీసా ముగిసినవారే ఎక్కువ**

ఆశ్చర్యకరంగా చాలా మంది అక్రమ వలసదారులు మొదట చట్టబద్ధంగా అమెరికాలోకి ప్రవేశించినవారే. వీసా గడువు ముగిసిన తర్వాత అక్రమంగా ఉండిపోతారు. వీరు అమెరికా సమాజానికి సేవలు అందిస్తూ, పన్నులు చెల్లిస్తూ, కుటుంబాలను పోషిస్తూ జీవిస్తున్నారు. అయితే ఎప్పుడూ నిర్బంధాలు, బహిష్కరణ భయంతో జీవించాల్సి వస్తుంది.

**లోపభూయిష్టమైన ఇమ్మిగ్రేషన్ వ్యవస్థ**

ఈ సమస్యకు అసలైన మూల కారణం నాసిరకంగా తయారైన ఇమ్మిగ్రేషన్ వ్యవస్థ. దీన్ని సరిచేయడానికి కేవలం కఠిన నియమాలు సరిపోవు. వాస్తవాలను ప్రతిబింబించేలా,

సరళమైన, న్యాయమైన మార్గాలు అవసరం. ఇది కేవలం నిబంధనల గురించి కాదు. మనుషుల జీవితాల గురించి కూడా. వారు అమెరికాలో భాగమయ్యారు.. కానీ వారి పత్రాలు అలా చెప్పకపోవడమే పెద్ద సమస్యగా మారనుంది.

## బెంగళూరుకు గుడ్‌బై: ఓ సిటీకి వీడ్కోలు... ఓ ఎమోషన్‌కు నమస్కారం!



**హైదరాబాద్ పెన్ పవర్:** బెంగళూరు... ఈ పేరు వినగానే మనసులో ఎన్నో జ్ఞాపకాలు, అనుభూతులు మెదులుతాయి. ఐటీ రంగానికి రాజధానిగా, యువత కలలకు వేదికగా మారిన ఈ నగరం ఎంతోమందికి ఆశ్రయం కల్పించింది. ఇక్కడికి వచ్చేవారు ఎన్నో ఆశలతో అడుగుపెడితే, తిరిగి వెళ్ళేవారు గుండె నిండా తీపి జ్ఞాపకాలతో వీడ్కోలు పలుకుతారు. ఇప్పుడు ఇదే పరిస్థితి టెక్ రంగంలో ప్రముఖుడైన రోహిత్ దోషికి ఎదురైంది. గోల్డ్‌మన్ సాచ్స్‌లో వైస్ ప్రెసిడెంట్‌గా పనిచేసిన ఈ సాఫ్ట్‌వేర్ ఇంజినీర్, బెంగళూరును విడిచి వెళ్తున్న సందర్భంగా లింక్డ్‌ఇన్‌లో పంచుకున్న భావోద్వేగ లేఖ లక్షలాది మంది హృదయాలను హత్తుకుంది. ఇది కేవలం ఓ నగరాన్ని వీడిన వ్యక్తి మనసులో మాట కాదు, ఎంతోమందికి బెంగళూరుతో ఉన్న అనుబంధానికి ప్రతిరూపంగా నిలిచింది.

**ఇది కేవలం నగరం కాదు... జ్ఞాపకాల బంధం!**

రోహిత్ తన లేఖలో బెంగళూరుతో గడిపిన క్షణాలను అద్భుతంగా వర్ణించారు. రామేశ్వరం కేఫ్‌లో అర్ధరాత్రి పూట తాగిన ఫిల్టర్ కాఫీ, నంది హిల్స్‌కు తెల్లవారుజామునే చేసిన విహారయాత్రలు, కబ్బన్ పార్క్, లాల్ బాగ్, చర్చ్ స్ట్రీట్, ఎంజీ రోడ్, విధాన సౌధ వంటి ప్రాంతాల్లోని స్మృతులన్నీ ఆయనకు ఎంతో ప్రత్యేకమైనవిగా మిగిలిపోయాయి. ఇందిరానగర్, మల్లేశ్వరం, ఎయిర్‌లైన్స్ హోటల్ వంటి ప్రదేశాలను ప్రస్తావిస్తూ బెంగళూరులో తన జీవితం ఎంత రంగులమయం, సంతోషభరితమైందో చెప్పారు. ఈ జ్ఞాపకాలు కేవలం రోహిత్‌కు మాత్రమే కాదు, బెంగళూరులో నివసించిన ప్రతి ఒక్కరికీ ఏదో ఒక రూపంలో గుర్తుంటాయి.

**"బెంగళూరు ట్రాఫిక్: ఓ సహన పరీక్ష!"**

అయితే, బెంగళూరు జీవితం అంటే కేవలం తీపి జ్ఞాపకాలు మాత్రమే కాదు. కొన్ని కఠినమైన వాస్తవాలు కూడా ఉన్నాయని రోహిత్ స్పష్టం చేశారు. ముఖ్యంగా ట్రాఫిక్ సమస్య గురించి ఆయన చేసిన వ్యాఖ్యలు నెటిజన్లను విశేషంగా ఆకట్టుకున్నాయి. "క్యాబ్‌లోనో ఆటోలోనో ఎక్కడికైనా వెళ్లడానికి డ్రైవర్ అంగీకరించడమే గొప్ప విషయం" అని ఆయన చమత్కరించారు. మెట్రో సేవలు అన్ని ప్రాంతాలకు అందుబాటులో లేకపోవడంతో ప్రైవేట్ రవాణాపై ఆధారపడాల్సి వస్తోందని, దీనివల్ల క్యాబ్ ఖర్చులు విపరీతంగా పెరిగాయని వివరించారు.

**"కాస్ట్ ఆఫ్ లివింగ్ – ఆర్థిక భారమే!"**

బెంగళూరులో రోజురోజుకూ పెరుగుతున్న జీవన ఖర్చులు (కాస్ట్ ఆఫ్ లివింగ్) కూడా ఒక ప్రధాన సమస్యగా రోహిత్ ప్రస్తావించారు. రూమ్ అద్దెల దగ్గరి నుంచి భోజనం వరకు ప్రతిదీ ఖరీదైనదిగా మారిపోయిందని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. అలాగే, వాతావరణం కూడా ఊహించలేనంతగా మారిపోతుందని, ఎప్పుడు వర్షం పడుతుందో అర్థం కాదని తెలిపారు.

**"బెంగళూరు నాకు పాఠాలు నేర్పింది"**

ఈ కష్టాలన్నింటినీ జీవితం నేర్పే పాఠాలుగా రోహిత్ స్వీకరించారు. బెంగళూరు తనకు ఎంతో నేర్పిందని, "ఎలా ప్రశాంతంగా ఉండాలో, అనూహ్య పరిస్థితుల్లో ఎలా రియాక్ట్ అవ్వాలో నేర్చుకున్నాను" అంటూ ఆయన చెప్పిన మాటలు ఎంతో మందికి స్ఫూర్తినిచ్చాయి. ఈ నగరం కేవలం ఉపాధిని మాత్రమే కాదు, జీవితాన్ని ఎలా ఎదుర్కోవాలో నేర్పిందని ఆయన అభిప్రాయపడ్డారు.

**నెటిజన్ల స్పందన: బెంగళూరు ఓ భావోద్వేగం!**

రోహిత్ పోస్టుకు లక్షలాది మంది లైక్స్, షేర్లతో స్పందించారు. "బెంగళూరు ఒక సిటీ కాదు... ఓ ఎమోషన్", "ఇక్కడ లభించే స్నేహాలు, జీవనశైలి మరెక్కడా దొరకదు", "ఇది విడిచి వెళ్తే గుండె బాధపడుతుంది" అంటూ నెటిజన్లు తమ అనుభవాలను పంచుకుంటూ కామెంట్లు చేశారు. ఇది బెంగళూరుతో ప్రజలకు ఉన్న లోతైన అనుబంధాన్ని తెలియజేస్తుంది.

బెంగళూరు అనేది కేవలం ఐటీ హబ్ కాదు... అది ఒక జీవన విధానం. ఎన్నో కలలతో ఈ నగరంలో అడుగుపెట్టిన వారిని స్వీకరించి, తీపి జ్ఞాపకాలతో తిరిగి పంపే ఈ నగరం ప్రతి ఒక్కరిపై తనదైన ముద్ర వేస్తుంది. రోహిత్ దోషి లాంటి అనేక మంది జీవితాల్లో ఈ నగరం ఒక ముఖ్యమైన అధ్యాయంగా నిలుస్తుంది.

# ఢిల్లీలో ఎయిరిండియా విమానంలో మంటలు!



**హైదరాబాద్ పెన్ పవర్:** భారతదేశంలో మరో విమానం టెన్షన్ పెట్టింది. హస్తినలో ఎయిరిండ్డియా విమానానికి పెను ప్రమాదం తప్పింది. ఇందులో భాగంగా... హాంకాంగ్ నుంచి ఢిల్లీ విమానాశ్రయానికి వచ్చిన విమానం ఏఐ-315 ల్యాండింగ్ అయిన కాసేపటికే ఆగ్జలరీ పవర్ యూనిట్ (ఏపీయూ) లో మంటలు అంటుకున్నాయి. ఈ ఘటనపై ఎయిరిండియా 'ఎక్స్' వేదికగా స్పందించింది. అవును... హాంకాంగ్ నుండి వచ్చి ఢిల్లీలో ల్యాండ్ అయిన కొద్దిసేపటికే ఎయిరిండియా విమానంలో మంటలు చెలరేగాయని ఎయిర్ లైన్స్ ప్రతినిధి తెలిపారు. విమానానికి కొంత నష్టం జరిగిందని, తదుపరి దర్యాప్తు కోసం విమానం నిలిపివేయబడిందని.. ఈ ఘటనలో ప్రయాణికులు, సిబ్బంది సురక్షితంగా బయటపడ్డారని ప్రతినిధి ఒకరు తెలిపారు. దీనిపై 'ఎక్స్' వేదికగా స్పందించిన ఎయిరిండియా... హాంకాంగ్ నుంచి ఢిల్లీకి వచ్చిన ఏఐ315 విమానం ల్యాండ్ అయిన కొద్దిసేపటికే ఆగ్జలరీ పవర్ యూనిట్ లో మంటలు చెలరేగాయని తెలిపింది. ప్రయాణీకులు దిగడం ప్రారంభించిన వెంటనే ఈ ఘటన జరిగిందని.. ఈ ఘటనలో విమానం స్వల్పంగా దెబ్బతిందని వెల్లడించింది. ఇదే సమయంలో... ప్రయాణీకులు, సిబ్బంది సాధారణంగానే దిగి సురక్షితంగా ఉన్నారని.. ఈ ఘటనపై తదుపరి దర్యాప్తు కోసం విమానం నిలిపివేశామని అని ఎయిరిండియా 'ఎక్స్'లో పేర్కొంది. మరోవైపు... 160 మంది ప్రయాణికులతో ఢిల్లీ - కోల్ కతా ఎయిరిండియా విమానం టేకాఫ్ సమయంలో సాంకేతిక సమస్య గుర్తించినట్లు ఎయిర్ లైన్స్ ప్రతినిధి ఒకరు ధృవీకరించారు. అనంతరం.. ఢిల్లీ విమానాశ్రయంలో టేకాఫ్ ను రద్దు చేసుకున్నట్లు తెలిపారు. ఆ తర్వాత తప్పనిసరి భద్రతా తనిఖీల కోసం ఏఐ2403 విమానం నిలిపివేయబడిందని వెల్లడించారు.

# మిగ్ 21కి భారత వైమానిక దళం గుడ్‌బై..
# అరవైయేళ్లుగా విశిష్ట సేవలు..

**హైదరాబాద్ పెన్ పవర్:** ఇండియన్ ఎయిర్ ఫోర్స్ కీలక నిర్ణయం తీసుకుంది. రష్యన్ మేడ్ మిస్ 21 ఫైటర్ ఫైట్లకు వీడ్కోలు పలకనుంది. భారత గగనతలాన్ని రక్షిస్తున్న ఈ యుద్ధ విమా నాలకు సెప్టెంబర్ లో ఐఏఎఫ్ రిటైర్మెంట్ ప్రకటించింది. వీటిని స్వదేశీ పరిజ్ఞానం తో అభివృద్ధి చేసిన తేజస్ మార్క్ 1ఏడో భర్తీ చేయనున్నారు. మిగ్-21 భారతీయ వైమానిక దళంలో కీలక పాత్ర పోషించింది. 1963లో తొలిసారి ఇండియా మిగ్ 21 విమానాలను వాడటం మొదలు పెట్టింది. మిగ్-21 భారత వైమానిక దళంలో సేవలో మొట్టమొదటి సూపర్‌సోనిక్ యుద్ధ విమానం.ఆరు దశాబ్దాలకు పైగా ఈ ఫైటర్ జెట్లు తమ సా మర్థ్యాన్ని ప్రదర్శించాయి. బసివిర్ దగ్గర ప్రస్తుతం 16 మిగ్-21 విమానాలు ఉన్నాయి. MiG-21 యుద్ధ విమానాల తొలగింపు వెనుక ఉన్న అతి పెద్ద కారణాలలో ఒకటి వాటి భద్రతా రికార్డు సరిగా లేకపోవడం. నివేదికల ప్రకారం..వాటిని ప్రవేశపెట్టినప్పటి నుంచి 400 కంటే ఎక్కువ MiG-21 విమానాలు కూలిపోయాయి. ఈ ప్రమాదాలలో చాలా వరకు ఓల్డ్ టెక్నాలజీ, ఇంజిన్ ఫెయిల్యూర్స్ కారణంగా సంభవించాయి. కాగా ఇటీవలి కాలంలో ఈ విమానాలు పలు ప్రమాదాలకు కారణమయ్యాయి.

2025 చివరి వాటిక్ మిస్21 విమానాలను తొలగించి వాటి స్థానంలో లైట్ కంబాట్ ఎయిర్ క్రాఫ్ట్ మార్క్ 12 విమానాలను విని యోగించనున్నట్లు అధికారులు తెలిపారు.

# యూట్యూబ్ సంచలన నిర్ణయం..
# వేలాది చైనా,రష్యా ఛానెళ్ల తొలగింపు




**హైదరాబాద్ పెన్ పవర్:** గూగుల్ సంస్థ సంచలన నిర్ణయం తీసుకుంది.ఫేక్ న్యూస్ షేర్ చేస్తున్న వివిధ దేశాలకు చెందిన 11వేల యూట్యూబ్ ఛానెళ్లను తొలగించింది. ఈ ఛానెళ్లు చైనా, రష్యాతోపాటు ఇతర దేశాలకు చెందిన దుష్ప్రచార కార్యక్రమాలు ప్రచార చేస్తున్నాయని తెలిపింది. తొలగించబడిన ఛానెళ్లలో 7వేల700కి పైగా చైనాకు చెందినవి. ఈ ఛానెళ్లు ప్రధానంగా చైనీస్, ఇంగ్లీష్ భాషలలో కంటెంట్‌ను పోస్ట్ చేశాయి. ఈ కంటెంట్ పీపుల్స్ రిపబ్లిక్ ఆఫ్ చైనాను ప్రోత్సహించడం, అధ్యక్షుడు జి జిన్‌పింగ్‌ను ప్రశంసించడం,US విదేశాంగ విధానంపై సానుకూల వ్యాఖ్యలు చేయడం వంటివి లక్ష్యంగా కంటెంట్ ఉన్నట్లు గూగుల్ సంస్థ తెలిపింది. మరో 2,000కి పైగా యూట్యూబ్ ఛానెళ్లు రష్యాకు సంబంధించినవి కాగా ఈ ఖాతాలు అనే భాషలలో మేసేజ్ లను వ్యాప్తి చేస్తున్నాయి. రష్యాకు మద్దతు ఇస్తూ ఉక్రెయిన్, NATO , పాశ్చాత్య దేశాలను విమర్శిస్తూ కంటెంట్ షేర్ చేస్తున్నాయి. ఈ కంటెంట్‌లో కొంత భాగం రష్యన్ ప్రభుత్వ మద్దతుగల సంస్థలు ,కన్సల్టింగ్ సంస్థలతో ముడిపడి ఉందని గూగుల్ తెలిపింది.

గతంలో రష్యా ఉక్రెయిన్‌పై దండయాత్ర చేసిన తర్వాత 2022 మార్చిలో రష్యన్ ప్రభుత్వ నియంత్రణలో ఉన్న మీడియా సంస్థ యూట్యూబ్ ప్రధాన ఛానెళ్లను బ్లాక్ చేసింది. 2025 మేలో కూడా %=ు%కి సంబంధించిన 20 యూట్యూబ్ ఛానెళ్లు, నాలుగు ప్రకటన ఖాతాలు, ఒక బ్లాగర్ బ్లాగును గూగుల్ తొలగించింది.చైనా ,రష్యాతో పాటు, ఇరాన్, అజర్‌బైజాన్, టర్కీ, ఇజ్రాయెల్, రొమేనియా, ఘనా వంటి దేశాలకు సంబంధించిన తప్పుడు ప్రచార ఛానెళ్లను గూగుల్ తొలగించింది. ఇవి రాజకీయ ప్రత్యర్థులను లక్ష్యంగా చేసుకుని షేర్ చేస్తున్నాయి. ఇజ్రాయెల్,-పాలస్తీనా సంఘర్షణ ,అంతర్గత ఎన్నికలు వంటి ప్రాంతీయ సమస్యలను ప్రస్తావించింది. అజర్‌బైజాన్‌కు చెందిన 457 ఛానెళ్లు అజర్‌బైజాన్ అనుకూల కథనాలను ప్రచారం చేస్తూ, అర్మేనియా,దేశీయ విమర్శకులను విమర్శించాయి.

**గూగుల్ చర్య:**

ఈ తొలగింపులు గూగుల్ థ్రెట్ అనాలిసిస్ గ్రూప్ (TAG) ఆధ్వర్యంలో జరిగాయి.%టూ+% ప్రపంచవ్యాప్తంగా ప్రభావ కార్యకలాపాలను పర్యవేక్షిస్తుంది.తొలగిస్తుంది. మొత్తంగా ఈ చర్యలు ఆన్‌లైన్‌లో దుష్ప్రచారాన్ని అరికట్టేందుకు కస్టమర్లను తప్పుదారి పట్టించకుండా చూసేందుకు ప్రజాస్వామ్య చర్చలను బలహీనపరచకుండా నిరోధించడానికి గూగుల్ ఈ చర్యలు చేపడుతోంది.

# అంబానీకి ఊహించని షాక్:
# ఎస్‌బీఐ 'ఫ్రాడ్' ముద్రతో కలకలం




**హైదరాబాద్ పెన్ పవర్:** భారత పారిశ్రామిక రంగంలో ఒకప్పుడు వెలుగు వెలిగిన పేరు అనిల్ అంబానీ. ధీరుభాయ్ అంబానీ వారసుడిగా రిలయన్స్ గ్రూప్‌ను ముందుకు నడిపించిన ఆయన, కొన్నేళ్లుగా ఆర్థిక సంక్షోభంలో చిక్కుకున్న విషయం తెలిసిందే. అప్పుల్లో కూరుకుపోయిన అనిల్ అంబానీకి తాజాగా స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా (ఎస్‌బీఐ) నుంచి మరో భారీ ఎదురుదెబ్బ తగిలింది. ఎస్‌బీఐ రిలయన్స్ కమ్యూనికేషన్స్ (ఆర్‌కాం) సంస్థను, అలాగే అనిల్ అంబానీని 'ఫ్రాడ్' (మోసగాడు) గా ప్రకటించింది.ఈ విషయాన్ని 2025 జూన్ 13న కేంద్ర ఆర్థిక శాఖ సహాయ మంత్రి పంకజ్ చౌదరి లోక్‌సభలో వెల్లడించడంతో రాజకీయ, వ్యాపార వర్గాల్లో తీవ్ర చర్చనీయాంశంగా మారింది.

**రుణ వ్యవహారంలో మోసం ఆరోపణలు**

రిలయన్స్ కమ్యూనికేషన్స్ సంస్థ ఎస్‌బీఐ నుంచి రూ. 2227.64 కోట్ల రుణాన్ని పొందింది. అయితే, ఈ రుణాన్ని తిరిగి చెల్లించకపోగా, సంస్థ దివాలా నియమావళి ప్రకారం కార్పొరేట్ ఇన్సాల్వెన్సీ రిజల్యూషన్ ప్రాసెస్ కు వెళ్లింది. అంతేకాకుండా, బ్యాంక్ గ్యారంటీల రూపంలో రూ. 786.52 కోట్లను కూడా ఎస్‌బీఐ చెల్లించాల్సిన పరిస్థితి ఏర్పడింది.

ఈ నేపథ్యంలోనే ఎస్‌బీఐ అనిల్ అంబానీ, ఆయన సంస్థను 'ఫ్రాడ్' వర్గంలోకి చేర్చి, రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా (ఆర్‌బీఐ)కి జూన్ 24న నివేదించింది. స్టాక్ ఎక్స్ఛేంజ్‌కి కూడా జూలై 1న ఈ సమాచారాన్ని అందించింది.

**గతంలోనూ ప్రయత్నాలు.. కోర్టుల బ్రేక్**

ఎస్‌బీఐ 'ఫ్రాడ్' ప్రకటన ఇది కొత్త పరిణామం కాదు. 2021 జనవరి 5న ఎస్‌బీఐ మొదటిసారిగా సీబీఐకి ఫిర్యాదు చేయగా, ఢిల్లీ హైకోర్టు ఆ సమయంలో స్టే ఇచ్చింది. 2023 మార్చి 27న సుప్రీంకోర్టు ఆదేశాల నేపథ్యంలో ఎస్‌బీఐ తన 'ఫ్రాడ్' వర్గీకరణను తాత్కాలికంగా వెనక్కి తీసుకుంది. అయితే, 2024 జూలై 15న జారీ అయిన ఆర్‌బీఐ తాజా మార్గదర్శకాల ప్రకారం అన్ని విధానాలను పాటించి, ఎస్‌బీఐ తిరిగి అనిల్ అంబానీ, ఆర్‌కాంలను 'ఫ్రాడ్'గా వర్గీకరించింది.

**రూ.31,000 కోట్ల రుణాల దుర్వినియోగం ఆరోపణ**

బ్యాంకు వర్గాల సమాచారం ప్రకారం, ఆర్‌కాం అనుబంధ సంస్థలు రూ.31,000 కోట్లకు పైగా రుణాలను వివిధ బ్యాంకుల నుంచి తీసుకుని, వాటిని గ్రూప్‌కు చెందిన ఇతర సంస్థలకు మళ్లించాయని ఆరోపణలు ఉన్నాయి. ఇదంతా ఆర్‌బీఐ ఫ్రాడ్ మేనేజ్‌మెంట్ గైడ్‌లైన్స్‌కు విరుద్ధంగా జరిగిందని ఎస్‌బీఐ తన నిర్ణయం తీసుకుంది.

**సీబీఐకి ఫిర్యాదుకు సిద్ధం**

ఈ పరిణామాల నేపథ్యంలో ఎస్‌బీఐ ఇప్పుడు సీబీఐకు అధికారికంగా ఫిర్యాదు చేయడానికి సిద్ధమవుతోంది. ఒకానొక కాలంలో ఆసియా అత్యంత ధనికుల్లో ఒకరిగా వెలుగొందిన అనిల్ అంబానీకి ఇది మరొక పెద్ద ఎదురుదెబ్బగా కనిపిస్తోంది.పారిశ్రామిక రంగంలో కీర్తిప్రతిష్టలను సంపాదించిన అనిల్ అంబానీకి ఈ తాజా పరిణామం తీవ్రమైన దెబ్బే అని చెప్పొచ్చు. ఆర్థిక వ్యవహారాల్లో పారదర్శకత, నిబంధనల పాటింపు ఎంత కీలకమో ఈ సంఘటన మరోసారి రుజువు చేస్తోంది.

# బరువుతో.. లావుతో బాధపడుతున్న వాళ్లకు గుడ్‌న్యూస్ :
# త్వరలో మెడికల్ షాపులను ముంచెత్తనున్న ట్యాబ్లెట్లు, ఇంజెక్షన్లు!




**హైదరాబాద్ పెన్ పవర్:** ప్రపంచ వ్యాప్తంగా ఎక్కువ జనాభా కలిగిన దేశాల్లో అగ్రగామిగా ఉన్న భారతదేశంలో ఊబకాయుల సంఖ్య కూడా అదే స్థాయిలో పెరిగిపోతోంది. మారుతున్న ఆహారపు, జీవశైలి అవలాట్లతో అధిక బరువు సమస్యను ఎదుర్కొంటున్న భారతీయుల సంఖ్య టీనేజర్ల నుంచి ఓల్డేజర్ల వరకు పెరిగిపోయిందని ఇప్పటికే పలు అధ్యయనాల రిపోర్టులు నిర్ధారించాయి. ఈ క్రమంలోనే భారత్ ప్రపంచ వెయిట్ మ్యానేజ్మెంట్ దిగ్గజ సంస్థలు ప్రస్తుతం భారత మార్కెట్ పై తమ దృష్టిని కేంద్రీకరిస్తున్నాయి. ఇండియన్ మార్కెట్ కొత్త స్థూలకాయ నిరోధక మందులకు ముఖ్యమైన మార్కెట్‌గా.. అలాగే సదరు మందుల సరసమైన జనరిక్ వెర్షన్‌ల ఉత్పత్తికి అభివృద్ధి చెందుతున్న కేంద్రంగా మారిపోయింది. పరిశ్రమను పెరుగుతున్న ఊబకాయుల సంఖ్య దేశంలో విస్తరించేలా చేస్తోంది. దీనికి ప్రభుత్వ ప్రోత్సాహకాలు తోడు కావటం విదేశీ సంస్థలను ఎక్కువగా భారతదేశానికి వచ్చేల్లా ప్రోత్సహిస్తోంది.

ప్రపంచ ప్రఖ్యాత ఫార్మా కంపెనీలైన నోవో నోర్డిస్క్ ఇటీవల తన విగోవీని లాంచ్ చేయగా.. దీనికి ముందు వచ్చిన ఇలి లిల్లీ ఉత్పత్తి మౌన్జారోతో పోటీపడుతోంది. ఇదే క్రమంలో దేశీయ దిగ్గజ ఫార్మా కంపెనీలైన డాక్టర్ రెడ్డీస్, సన్ ఫార్మా, సిప్లా, బయోకాన్, లుపిన్ వంటి సంస్థలు ఇప్పటికే తమ సొంత జనరిక్ వేరియంట్లను సిద్ధం చేసుకుంటున్నాయి. 2026 నాటికి విదేశీ సంస్థల పేటెంట్ల కాలం ముగియనున్న నేపథ్యంలో అప్పటికి తమ ఉత్పత్తులను అందుబాటులోకి తీసుకురావాలని ఇండియన్ ఫార్మా దిగ్గజాలు చూస్తున్నాయి.

భారత మార్కెట్లలో ఉన్న పేషెంట్ల సంఖ్యతో పాటు పెద్ద వ్యాపార అవకాశాన్ని క్యాష్ చేసుకోవాలని ప్రపంచ ఫార్మా దిగ్గజాలు చూస్తున్నాయి. అందుకే తమ అడ్వాన్స్ యాంటీ ఒబెసిటీ మందులను వేగంగా ఇక్కడి మార్కెట్లోకి లాంచ్ చేస్తున్నాయని తేలింది. మార్చి నుంచి మే అంటే మూడు నెలల కాలంలోనే మౌన్జారో మందు అమ్మకాలు దేశంలో రూ.24 కోట్ల టర్నోవర్ సాధించిందని ఫార్మా ర్యాక్ డేటా ప్రకారం వెల్లడైంది. అయితే ప్రస్తుతం ఈ అమ్మకాలు జూన్ ఒక్క నెలలోనే రెండితలై రూ.50 కోట్ల వ్యాపారాన్ని సాధించింది.

దేశంలోని మధ్యతరగతి, ఎగువ మధ్యతరగతి ప్రజలే టార్గెట్ గా విదేశీ ఫార్మా కంపెనీలు ముందుకు సాగుతున్నాయి. ఈ మందుల డోసేజ్ విలువ నెలకు రూ.14వేల నుంచి రూ.17వేల 500 వరకు భరించగలిగే స్థాయిలో ఉండటంతో ఫార్మా కంపెనీలకు కాసుల వర్షం కురుస్తోంది. అందుకే మౌన్జారో లాంటి మందుల కొనుగోళ్లు వేగంగా పెరుగుతున్నట్లు తేలింది. ప్రజల ఆలోచనలో మార్పులు ముందస్తు రోగాలను నిరోధించేందుకు ప్రాధాన్యతలు యాంటీ ఒబెసిటీ మందుల అమ్మకాలను వేగంగా పెంచేస్తున్నాయి.

త్వరలోనే వెయిట్ మేనేజ్మెంట్ ఔషదాల పేటెంట్స్ కాలం ముగియటానికి దగ్గరపడిన వేళ వీటి జనరిక్ వేరియంట్లు భారత మార్కెట్లో సునామీలా లాంచ్ అవ్వటానికి మరో పక్క రెడీ అవుతున్నాయి. ఇదే జరిగితే బరువు తగ్గించే మందులతో పాటు డయాబెటిక్ మందులు సరసమైన ధరలకు భారతీయులకు అందుబాటులోకి వస్తాయని నిపుణులు చెబుతున్నారు.

# విడాకుల కేసుపై సుప్రీంకోర్టులో ఆసక్తికర వాదనలు: నెలకు
# రూ.కోటిపై అవాక్కు..చివరికి తీర్పు ఎలా వచ్చిందంటే..!

**హైదరాబాద్ పెన్ పవర్:** సమాజం ఎలా ఉందో కళ్లకు కనిపిస్తూనే ఉంది..భర్తను చంపే భార్యలు..భార్యలను చంపే భర్తలు..వీటితోపాటు విడాకుల కేసులు. 2025, జూలై 22న సుప్రీంకోర్టు చీఫ్ జస్టిస్ బెంచ్?పై విడాకుల కేసు విచారణ జరిగింది. ఈ కేసు విచారణ సందర్భంగా..చీఫ్ జస్టిస్ గవాయ్ ఆసక్తికర వ్యాఖ్యలు చేశారు..కొన్ని ప్రశ్నలను కూడా సంధించారు. మహిళ కోరుకున్న డిమాండ్లు విని కొంచెం అవాక్కయ్యిన జడ్జిగారు..బాధిత భార్యపై..అదే విధంగా విడాకులు కోరుతున్న భర్తపైనా సంధించిన ప్రశ్నలు ఆసక్తికరంగా ఉన్నాయి.



ప్రధాన న్యాయమూర్తి బి.ఆర్ గవాయ్: జీవనభృతి కోసం మీ డిమాండ్ ఏమిటి?

మహిళ: ముంబైలో ఒక ఇల్లు కావాలి. అంతేకాకుండా నా మెయింటెనెన్స్ కోసం.. రూ.12 కోట్లు ఇవ్వాలి.

%జజీ×% గవాయ్: (ఆశ్చర్యంగా) ఆ ఇల్లు కల్పతరులో ఉంది. అది మంచి బిల్డర్లలో ఒకరు. మీరు ఐటీ నిపుణురాలు, ఎంబీఏ కూడా చేశారు. మీకు మంచి డిమాండ్ ఉంది. బెంగళూరు, హైదరాబాద్‌లలో ఎందుకు ఉద్యోగం చేయకూడదు? మీ వివాహం జరిగి కేవలం 18 నెలలే అయింది. ఇప్పుడు మీకు %దీవీఔ% కూడా కావాలా? 18 నెలల వివాహం కోసం మీరు నెలకు ఒక కోటి రూపాయల భృతి కోరుకుంటున్నారా?

లేడీ: అతను చాలా ధనవంతుడు. నాకు స్కిజోఫ్రెనిక్ అనిపించుకుని విడాకులు తీసుకోవాలనుకుంటున్నాడు.

సీనియర్ అడ్వైజర్ మాధవి దివాన్: (భర్త తరపున నిలబడి) ఆమె కూడా పని చేయాలి. ప్రతిదీ ఇలా డిమాండ్ చేయకూడదు.

లేడీ: నేను స్కిజోఫ్రెనిక్‌గా కనిపిస్తున్నానా మై లార్డ్స్!

%జజీ×% గవాయ్: ఆదాయపు పన్ను రిటర్న్‌లను దాఖలు చేయండి. కానీ మీరు అతని తండ్రి ఆస్తులను కూడా క్లెయిమ్ చేయలేరని అర్థం చేసుకోండి.

లేడీ: నా భర్త నా న్యాయవాదిని ప్రభావితం చేశాడు.

సీజేఐ: ఎవరిని ప్రభావితం చేశాడు?? మీరు ఆ ఫ్లాట్‌తో సంతృప్తి చెందండి లేదా 4 కోట్లు తీసుకొని మంచి ఉద్యోగం చూసుకోండి.

సీజేఐ: మేం దానిని కూడా రద్దు చేస్తాం. కానీ జీవితాన్ని మీరు కూడా నిలబెట్టుకోవాలి.ఇలా చాలా ఆసక్తికరంగా సాగింది సుప్రీంకోర్టులో విచారణ.

పిటిషనర్ అయిన మహిళ డిమాండ్లను విని అవాక్కయిన చీఫ్ జస్టిస్.. చివరికి ఆమె కోరికలకు కళ్లెం వేస్తూ..భర్త ఇచ్చే భరణంతోపాటు తన పోషణకు తాను కూడా పనిచేయాలని ఆ మహిళను ఆదేశించారు.

# భారత ఆర్థిక వ్యవస్థను తొక్కేస్తాడంట వీడు.. :
# అమెరికా సెనేటర్ బలుపు మాటలు చూడండి..!




**హైదరాబాద్ పెన్ పవర్:** గడచిన కొన్ని వారాలుగా రష్యా నుంచి ఆయిల్ కొనుగోలు చేస్తున్న దేశాలపై అమెరికా ఆంక్షలు ఉంటాయనే వాదనలు వినిపిస్తున్నాయి. ఈ క్రమంలోనే యూఎస్ సెనెటర్ లిండ్సీ గ్రాహమ్ నోరు పారేసుకున్నారు. రష్యా నుంచి తక్కువ ధరకు క్రూడ్ ఆయిల్ కొంటున్న చైనా, ఇండియా, బ్రెజిల్ తో పాటు బ్రిక్స్ దేశాలకు హెచ్చరిక జారీ చేశారు. రష్యన్ ఆయిల్ కొనటం కొనసాగిస్తున్న దేశాలపై ఆర్థిక ఆంక్షలు విధిస్తామని అన్నారు.ఒక టీవీ ఇంటర్వ్యూలో మాట్లాడిన గ్రాహమ్ ఆయిల్ కొనటం ఆపకపోతే 500 శాతం వరకు భారీ సుంకాలను విధిస్తామని.. ఆయిల్ కొనే దేశాల ఆర్థిక వ్యవస్థలను తొక్కేస్తామంటూ రెచ్చిపోయారు. రష్యా నుంచి కొనుగోళ్లను నిలిపివేయటం ద్వారా ఆర్థికంగా దానిని బలహీన పరిచి రష్యా-ఉక్రెయిన్ యుద్ధానికి అంతం పలకాలని అమెరికా భావిస్తున్నట్లు ఆయన మాటల్లో వెల్లడైంది. ఆయిల్ కొంటున్న దేశాలు లాభపడటాన్ని బ్లడ్ మనీ అంటూ కామెంట్ చేశారు గ్రాహమ్.రష్యాతో వ్యాపారం చేస్తూ ఆ దేశానికి ఆర్థికంగా అండగా నిలుస్తు్న దేశాలపై అమెరికా ప్రస్తుతం సీరియస్ గా ఉన్న తరుణంలో ఈ కామెంట్స్ అందరి దృష్టిని ఆకట్టుకుంటున్నాయి. రష్యాను ఆర్థికంగా బలహీన పరిచి ఏకాకిగా మార్చటం ద్వారా యుద్ధాన్ని ఆపాలన్నదే యూఎస్ ప్లాన్. రానున్న 50 రోజుల్లో శాంతి చర్చలకు పుతిన్ రాకపోతే రష్యా నుంచి ఆయిల్ అండ్ గ్యాస్ కొంటున్న దేశాలపై సెకండరీ సుంకాలు 100 శాతం విధించనున్నట్లు ట్రంప్ గతవారం చెప్పారు. పగలు తనతో ప్రశాంతంగా చర్చలు జరిపి రాత్రికి ఉక్రెయిన్ పై మిసైళ్ల వర్షం కురిపించటంపై ట్రంప్ ఆగ్రహం వ్యక్తం చేశారు. సుంకాల ప్రాథమిక ఉద్దేశం రష్యాను చర్చలకు రప్పించటమేనని ట్రంప్ చెప్పారు. గతంలోని అమెరికా నేతలను ఫూల్స్ చేసినట్లు పుతిన్ తనను ఏమార్చలేడని ట్రంప్ అన్నారు.

# తగ్గేదేలే అంటున్న రోజా.. పవన్ పై షాకింగ్ కామెంట్స్...

**హైదరాబాద్ పెన్ పవర్:** అనుచిత, అభ్యంతరక వ్యాఖ్యలను సహించేది లేదని కూటమి ప్రభుత్వం హెచ్చరిస్తున్నా, వైసీపీ, టీడీపీ నేతలు తగ్గేదేలే అంటున్నారు. పోటాపోటీగా దూషణలకు దిగుతూ రాజకీయంగా రచ్చ చేస్తున్నారు. తాజాగా నగరి మాజీ ఎమ్మెల్యే, మాజీ మంత్రి ఆర్కే రోజాపై సిట్టింగు ఎమ్మెల్యే గాలి భానుప్రకాశ్ తీవ్ర విమర్శలు చేశారు. దీనిపై కన్నీళ్లు పెట్టుకున్న మాజీ మంత్రి రోజా ఎమ్మెల్యేపై పోలీసులకు ఫిర్యాదు చేశారు. అయితే ఆమెకు కౌంటరుగా టీడీపీ కూటమి నేతలు డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ పై రోజా చేసిన వ్యాఖ్యల వీడియోను బయటపెట్టారు. ప్రస్తుతం ఇది సోషల్ మీడియాలో వైరల్ గా మారింది.కూటమి నేతలను లక్ష్యంగా చేసుకుని రోజా చేస్తున్న వ్యాఖ్యలపై అభ్యంతరాలు వ్యక్తం చేస్తున్నారు. తాజాగా ఓ మీడియా చానల్ తో మాట్లాడిన రోజా కొన్ని వివాదాస్పద వ్యాఖ్యలు చేశారని చెబుతున్నారు. వైసీపీ అధికారంలోకి వస్తే పారిపోతారని హెచ్చరించడంతోపాటు డిప్యూటీ సీఎం పవన్ పై రోజా ఘాటు వ్యాఖ్యలు చేయడంతో ఈ వివాదం కొత్తమలుపు తీసుకుంది. "ఈ ఎమ్మెల్యేలు గాల్లో గెలిచిన గాలి.."

అంటూ రోజా అభ్యంతరకర వ్యాఖ్యలు చేశారని విమర్శిస్తున్నారు. ఒక్కరు కూడా ప్రజల వద్దకు వెళ్లి ఏం కష్టమో అడగరని ఆక్షేపించారు. రేపు వైసీపీ అధికారంలోకి వస్తే టీడీపీ, జనసేన నాయకులు హైదరాబాదుకు కాదు అమెరికాకు పారిపోతారని రోజా హెచ్చరించారు. ముఖ్యమంత్రి చంద్రబాబు, మంత్రి లోకేశ్, డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ వీకెండ్ నాయకులు అంటూ రోజా కామెంట్ చేశారు.ప్రజలకు రేషన్ పంపిణీ చేసే వాహనాలకు డబ్బులు లేవని చెబుతూ, వీళ్లు మాత్రం హెలికాప్టర్, విమానాల్లో తిరుగుతున్నారని ఆరోపించారు. వైసీపీ నాయకులను ఇబ్బంది పెడితే వందకు వంద చెల్లిస్తామని రోజా ఘాటు వ్యాఖ్యలు చేశారు. ఇక పవన్ కల్యాణ్ కు పిచ్చి బాగా ముదిరిందని.. ఎక్కడికి వెళితే

అక్కడ పుట్టానంటాడని రోజా ఎద్దేవా చేశారు. చివరకు సుబ్రహ్మణ్యస్వామి అభిమానిని అంటూ చెప్పుకోవడంపైనా రోజా విమర్శలు గుప్పించారు. తనపై ఎమ్మెల్యే చేసిన విమర్శలతో కంటపడిన రోజా.. ఇతర నాయకులపై నోటికొచ్చినట్లు మాట్లాడవచ్చా? అంటూ జనసేన నేతలు ప్రశ్నిస్తున్నారు. ఇక రోజా వ్యవహారశైలిపై స్పందించిన శాప్ చైర్మన్ రవినాయుడు మీడియాతో మాట్లాడుతూ రోజాకు కౌంట్ డౌన్ స్టార్ట్ అయిందని హెచ్చరించారు. మరో పది రోజుల్లో ఆమె అరెస్టు ఖాయమంటూ రవినాయుడు వ్యాఖ్యానించారు.

# నేడు ఇండియా, ఇంగ్లాండ్ నాలుగో టెస్ట్.. ఊహించని విధంగా ఓల్డ్ ట్రాఫర్డ్ పిచ్!



**హైదరాబాద్ పెన్ పవర్:** మాంచెస్టర్ వేదికగా బుధవారం (జూలై 23) ఇండియా, ఇంగ్లాండ్ జట్ల మధ్య నాలుగో టెస్ట్ జరగనుంది. ఈ మ్యాచ్ లో టీమిండియా గెలవడం అత్యంత కీలకం. ఐదు మ్యాచ్ ల టెస్ట్ సిరీస్ లో 1-2తో వెనకబడిన గిల్ సేన ఈ టెస్టులో ఓడిపోతే సిరీస్ కోల్పోతుంది. దీంతో ఎలాగైనా ఈ మ్యాచ్ లో గెలిచేందుకు తీవ్ర కసరత్తులు చేస్తుంది. మరో వైపు ఇప్పటికే 2 టెస్టులు గెలిచిన ఇంగ్లాండ్ ఈ మాంచెస్టర్ టెస్టులోనూ గెలిచి చివరి టెస్ట్ మిగిలి ఉండగానే సిరీస్ కైవసం చేసుకోవాలని భావిస్తోంది. మ్యాచ్ జరగబోయే ఓల్డ్ ట్రాఫర్డ్ పిచ్ ఎలా ఉంటుందో ఇప్పుడు చూద్దాం..

మాంచెస్టర్‌లోని ఓల్డ్ ట్రాఫోర్డ్ పిచ్ సహజంగానే పేస్ తో పాటు బౌన్స్‌ను అనుకూలిస్తుంది. ఓల్డ్ ట్రాఫోర్డ్ పిచ్ ఎడ్జ్‌బాస్టన్ మాదిరిగానే కనిపిస్తుంది. పిచ్‌పై ఎక్కువగా గడ్డి ఉంది. ఇండియా, ఇంగ్లాండ్ సిరీస్‌లోని మొదటి మూడు టెస్ట్ మ్యాచ్‌లలో చూసినట్లుగా, మ్యాచ్ ప్రారంభానికి ముందు పిచ్ పై చాలా గడ్డి ఉంటుంది. టెస్ట్ సమయంలో వర్షం పడే అవకాశం ఉన్నందున, పరిస్థితులు ఫాస్ట్ బౌలర్లకు అనుకూలంగా ఉండే అవకాశం ఉంది. ఇక్కడ ట్విస్ట్ ఏంటంటే ఇటీవలి కాలంలో పిచ్ ఉపరితలం నెమ్మదిగా మారింది. అందువల్ల స్పిన్నర్లు ఈ మ్యాచ్ లో కీలక పాత్ర పోషించే అవకాశం ఉంది. మాంచెస్టర్‌లో ఇరు జట్లు ఇద్దరు స్పిన్నర్లతో బరిలోకి దిగవచ్చు. ఈ మ్యాచ్ లో టీమిండియా మూడు మార్పులతో బరిలోకి దిగే అవకాశం కనిపిస్తుంది. బ్యాటింగ్ లో టీమిండియా ఒక్క మార్పుతో బరిలోకి దిగే అవకాశం ఉంది. నితీష్ రెడ్డి స్థానంలో వికెట్ కీపర్ ధృవ్ జురెల్ జట్టులోకి రావడం దాదాపుగా ఖాయమైంది. బౌలింగ్ లో గాయపడిన ఆకాష్ దీప్ స్థానంలో కొత్త కుర్రాడు అన్షుల్ కంబోజ్ వచ్చే అవకాశం ఉంది. సుందర్ స్థానంలో స్పెషలిస్ట్ స్పిన్నర్ కుల్దీప్ యాదవ్ ను ఆడించే అవకాశాలు కూడా కనిపిస్తున్నాయి. ఆతిథ్య ఇంగ్లాండ్ ఈ మ్యాచ్ లో ఒక మార్పుతో బరిలోకి దిగుతుంది. లార్డ్స్ వేదికగా జరిగిన మూడో టెస్టులో గాయపడిన షోయబ్ బషీర్ స్థానంలో ఆఫ్ స్పిన్నర్ లియామ్ డాసన్‌ను ఇంగ్లాండ్ తుది జట్టులో చోటు కల్పించింది.

# ఒలింపిక్ గోల్డ్ మెడల్ విన్నర్స్‌కు రూ.7 కోట్లు.. గ్రూప్ A ఉద్యోగాలు: ఢిల్లీ గవర్నమెంట్





**హైదరాబాద్ పెన్ పవర్:** లాస్ ఏంజిల్స్‌లో 2028 లో జరగబోయే ఒలింపిక్స్ క్రీడల్లో విజయం సాధించిన వారికి ఢిల్లీ గవర్నమెంట్ మూడు సంవత్సరాల ముందుగానే నజరానా ప్రకటించింది. ఢిల్లీ ఒలింపిక్ క్రీడల విజేతలకు నగదు బహుమతిని భారీగా పెంచడం విశేషం. ముఖ్యమంత్రి ఖేల్ ప్రోత్సాహన్ యోజన కింద ఢిల్లీ ప్రభుత్వం మంగళవారం (జూలై 22) జరిగిన క్యాబినెట్ సమావేశంలో చారిత్రాత్మక నిర్ణయాలు తీసుకుంది. ఢిల్లీ తరపున ఒలింపిక్స్ లో గోల్డ్ మెడల్ సాధించిన విజేతకు రూ.7 కోట్లు నజరానాను ప్రకటించారు. అంతేకాదు బంగారు పతకం సాధించిన అథ్లెట్లకు గ్రూప్ A ఉద్యోగాలు లభించనున్నాయి.

సిల్వర్ మెడల్ విజేతలకు రూ. 5 కోట్లు.. కాంస్య పతక విజేతలకు రూ. 3 కోట్లు అందజేయబడతాయి. సిల్వర్, కాంస్య విభాగాల్లో విజయం సాధించిన వారికి గ్రూప్ B ఉద్యోగాలు లభిస్తాయి. గతంలో ఒలింపిక్, పారాలింపిక్ పతక విజేతలకు గోల్డ్ మెడల్ విజేతకు రూ. 3 కోట్లు, సిల్వర్ మెడల్ విజేతకు రూ.2 కోట్లు, కాంస్య పతక విజేతలకు రూ. 1 కోటి చొప్పున బహుమతి ఇచ్చేవారు. గత ఏడాది 2024 పారిస్ ఒలింపిక్స్‌లో భారత్ తరఫున 16 క్రీడాంశాల్లో 117 మంది పోటీపడగా.. కనీసం 10 నుంచి 15 పతకాలైనా వస్తాయని అభిమానులు ఆశించారు. కానీ, అభిమానుల ఆశలు ఫలించలేదు. ఊరించి ఊరించి చివరికి ఆరు పతకాలతో సరిపెట్టుకుంది మన దేశం. ఇందులో ఐదు కాంస్యాలు, ఒక రజత పతకం ఉన్నాయి. పారిస్ ఒలింపిక్స్‌లో భారత అథ్లెట్లు మొత్తం ఆరు పతకాలు సాధించగా, అందులో మూడు షూటింగ్‌లో వచ్చినవే. అయితే, అత్యుత్తమ మెడల్ రజతం.. పురుషుల జావెలిన్ విభాగంలో వచ్చింది. 40 స్వర్ణాలతో చైనా, అమెరికా దేశాలు సమంగా ఉన్నప్పటికీ, ఎక్కువ రజత పతకాల ఆధారంగా అమెరికన్లు టాప్‌లో నిలిచారు. ఈసారి విశ్వక్రీడల్లో వందకు పైగా ఒలింపిక్ పతకాలు సాధించిన ఏకైక దేశం.. అమెరికా(40 గోల్డ్‌ం 44 సిల్వర్‌ం 42 బ్రాంజ్= 126 పతకాలు) మాత్రమే. ఈ ఒలింపిక్స్ క్రీడల్లో 91 పతకాలతో డ్రాగన్ దేశం చైనా(40 గోల్డ్) రెండో స్థానంలో ఉండగా.. జపాన్(20 గోల్డ్), ఆస్ట్రేలియా(18 గోల్డ్) మూడు, నాలుగు స్థానాల్లో నిలిచాయి. ఈ పతకాల పట్టికలో భారత్ 71వ స్థానంలో నిలిచింది.

# కోహ్లీ, రోహిత్ 2027 వన్డే వరల్డ్ కప్ ఆడలేరు.. కారణమిదే: హర్భజన్ హాట్ కామెంట్స్



**హైదరాబాద్ పెన్ పవర్:** టీమిండియా స్టార్ క్రికెటర్లు రోహిత్ శర్మ, విరాట్ కోహ్లీ టీ20, టెస్ట్ కెరీర్ కు రిటైర్మెంట్ ప్రకటించారు. గత ఏడాది టీ20 వరల్డ్ కప్ గెలిచాక ఇద్దరూ పొట్టి ఫార్మాట్ కు గుడ్ బై చెప్పగా.. ఇటీవలే టెస్ట్ ఫార్మాట్ కు వీడ్కోలు తెలిపి షాక్ కు గురి చేశారు. దీంతో ఈ ఇద్దరు దిగ్గజాలు లేకుండానే భారత్ టీ20, టెస్ట్ క్రికెట్ ఆడనుంది. అయితే వన్డే క్రికెట్ లో మాత్రం మరో రెండేళ్లు కొనసాగనున్నారు. దీనికి కారణం లేకపోలేదు.

సౌతాఫ్రికా వేదికగా 2027లో వన్డే వరల్డ్ కప్ జరగనుంది. ఈ మెగా టోర్నీకి తాము సిద్ధంగా ఉన్నామని ఇప్పటికే రోకో జోడీ హింట్ కూడా ఇచ్చారు. ఫ్యాన్స్ కు కూడా ఈ విషయం ఊరట కలిగించేదే. విరాట్ కోహ్లీ , రోహిత్ శర్మ రెండు ఫార్మాట్లకు రిటైర్మెంట్ ప్రకటించడంతో వీరిద్దరూ 2027 వన్డే ప్రపంచ కప్ ఆడటం కష్టమని టీమిండియా మాజీ క్రికెటర్ హర్భజన్ సింగ్ సంచలన వ్యాఖ్యలు చేశాడు."నిజానికి 2027 వన్డే వరల్డ్ కప్ చాలా దూరంలో ఉంది. రోహిత్, కోహ్లీ వన్డే ఫార్మాట్ మాత్రమే ఆడుతున్నారు. వారు ఇతర ఫార్మాట్లలో ఆడటం లేదు. మీకు ఎంత నిబద్ధత ఉన్నా.. మీరు ఎంత గొప్పవారైనా ఒక ఫార్మాట్ ఆడి రెండేళ్లు వన్డే క్రికెట్ కొనసాగించడం చాలా కష్టం అవుతుంది. మీరు కంటిన్యూగా క్రికెట్ ఆడకపోతే ఆట ముందుకు కదులుతుంది. కానీ మీరు వెనుకబడిపోతారు". అని హర్భజన్ తన యూట్యూబ్ ఛానెల్‌లో అన్నారు.ఈ సందర్భంగా ధోనీని ఉదాహరణంగా చూపించాడు. " ఐపీఎల్‌లో ఎంఎస్ ధోని ఆటను చూడండి. గత మూడు సీజన్ లలో అతని ప్రదర్శన చూస్తే అతని నిలకడ లోపించింది. ఆరు సంవత్సరాల క్రితం ఇండియా తరపున ఆడేటప్పుడు నిలకడగా ఆడిన ధోనీకి.. రిటైర్మెంట్ ప్రకటించిన తర్వాత ఐపీఎల్ లో ధోనీకి మధ్య తేడా మీకు కనిపిస్తుంది" అని హర్భజన్ అన్నారు.

కొన్ని నెలల క్రితం భారత దిగ్గజ క్రికెటర్ సునీల్ గవాస్కర్ సైతం 2027 వన్డే ప్రపంచ కప్‌కు భారత జట్టులో విరాట్ కోహ్లీ, రోహిత్ శర్మలు ఉండరని తన అభిప్రాయాన్ని తెలిపాడు. ఇండియా టుడేతో మాట్లాడుతూ.. 50 ఓవర్ల ఫార్మాట్‌లో ఈ ఇద్దరు బ్యాట్స్‌మెన్ అద్భుతమైన ప్రదర్శన కనబరిచినప్పటికీ, మరో రేండేళ్లు వారు క్రికెట్ లో కొనసాగడం అవకాశం లేదని తెలిపారు.



ఆరెంజ్ చీరలో అదితి గౌతమ్ సొగసైన లుక్: 'ఇక్ ములాఖత్ మే' మూమెంట్

# తొలిప్రేమ మ్యాజిక్ మళ్లీ రిపీట్



సక్సెస్ ఫెయిల్యూర్స్ తో సంబంధం లేకుండా తనకంటూ ఒక ప్రత్యేకమైన గుర్తింపు అందుకున్నాడు మెగా హీరో వరుణ్ తేజ్. అలాగే ప్రయోగాలు చేయడంలో కూడా ముందుంటాడు అని ఇదివరకు క్లారిటీ ఇచ్చాడు. ఇక ఈ మెగా హీరో తన కెరీర్‌ను మళ్లీ ట్రాక్‌పైకి తీసుకురావడానికి తీవ్రంగా కృషి చేస్తున్నాడు. విభిన్న కథాంశాలపై దృష్టి పెట్టిన వరుణ్, ఇప్పుడు ఓ ఆసక్తికరమైన చిత్రంతో ప్రేక్షకులను అలరించేందుకు సిద్ధమవుతున్నాడు.మెర్లపాక గాంధీ దర్శకత్వంలో రూపొందుతున్న %ు%15 అనే ఈ సినిమా, ఇండియన్-కొరియన్ బ్యాక్ డ్రాప్ హారర్ కామెడీగా తెరకెక్కుతోంది. యూవీ క్రియేషన్స్, ఫస్ట్ ఫ్రేమ్ ఎంటర్‌టైన్‌మెంట్స్ సంస్థలు కలిసి ఈ సినిమాను నిర్మిస్తున్నాయి. ఇండియన్ సినిమాలో ఎప్పుడూ చూడని విభిన్న కోణంలో కథను చూపించబోతున్నారనే ఆసక్తి సినిమాపై ఏర్పడింది. ఇదే విషయాన్ని టెక్నికల్ టీమ్ బలంగా నమ్ముతోంది.తాజాగా ఈ సినిమా మ్యూజిక్ పనులు వేగంగా సాగుతున్నాయి. మ్యూజిక్ డైరెక్టర్ థమన్, హీరో వరుణ్ తేజ్, డైరెక్టర్ గాంధీ కలిసి మ్యూజిక్ సెషన్స్ లో పాల్గొంటున్నారు. ఇది వరుణ్ తేజ్ థమన్ కాంబినేషన్‌కు రెండో సినిమా. ఇంతకుముందు వీరి కలయికలో వచ్చిన 'తొలిప్రేమ' మ్యూజికల్ హిట్ గా నిలిచింది. ఇప్పుడు %ు%15కు కూడా థమన్ ప్రత్యేక శ్రద్ధ తీసుకుంటున్నారు.ఇప్పటికే రెండు పాటలు షూట్ చేయగా, ఆ పాటలు సినిమాకు ప్రధాన హైలైట్ గా నిలవబోతున్నాయని చిత్ర బృందం తెలిపింది. మ్యూజిక్ తప్పకుండా ప్రేక్షకులను ఆకట్టుకుంటుందని నమ్మకం వ్యక్తం చేశారు. పాటల విజువల్స్ కొత్తగా ఉండేలా ప్లాన్ చేస్తున్నారు. ఇక నేపథ్య సంగీతం విషయంలో కూడా థమన్ ప్రత్యేకంగా ఫోకస్ పెట్టుతున్నారట.

వరుణ్ తేజ్ పాత్ర ఈ చిత్రంలో చాలా స్పెషల్‌గా ఉండబోతోందని సమాచారం. భిన్నమైన గెటప్, కొత్తగా డిజైన్ చేసిన క్యారెక్టర్‌తో ప్రేక్షకులను మెప్పించనున్నాడట. ఎమోషన్, కామెడీ, హారర్.. అన్ని అంశాలను బ్యాలెన్స్ చేస్తూ రూపొందిస్తున్న ఈ సినిమా ఒక పూర్తి స్థాయి ఎంటర్టైనర్‌గా ఉంటుందని మేకర్స్ చెబుతున్నారు. షూటింగ్ చివరి దశకు చేరుకున్న నేపథ్యంలో, త్వరలో ఫస్ట్ లుక్, టైటిల్‌ను రిలీజ్ చేయబోతున్నారు.



కృతి సనన్ నెయిల్స్ చిక్ రెడ్ పవర్ లుక్

On behalf of Printed, Published and owned by GANTYADA APPA RAO, D.No:38-4-217/A, Maharani street, Marripalem, Visakhapatnam -530018, Andhrapradesh. Printed At SRI SAI GANGA PRINTERS AND PUBLISHERS D.No:38-4-217/A, Maharani street, Marripalem, Visakhapatnam -530018, Andhrapradesh.
Editor: G.APPARAO, Mobile : 9059465965, RNI : APTEL/2014/58046, e-mail:penpower9@gmail.com